
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 14 అక్టోబరు 2025





సీఆర్‌డీఏ కార్యాలయంలో విభాగాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

మీ త్యాగం మరువను

- నిలువనీడలేని రోజున కూర్చునేందుకు చోటిచ్చారు
- ఒక్క మాటతో వేల ఎకరాల భూమినిచ్చారు
- రాజధాని నిర్మాణానికి దారి చూపారు
- స్థల బలం, ఆడబిడ్డల పోరాటంతోనే నేటి అమరావతి
- సీడ్, కోర్ క్యాపిటల్‌లతో సింగపూర్ అద్భుతమైన ప్లాన్
- అమరావతి నుంచి నేరుగా ఏడు రాష్ట్రాలకు రోడ్లు
- గ్రీన్ ఎనర్జీతో కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం
- అట్టహాసంగా ప్రారంభమైన ఏపీ సీఆర్డీఏ కార్యాలయం
- రైతులు, మహిళలతో సీఎం చంద్రబాబు భావోద్వేగ ప్రసంగం

గుంటూరు,తుళ్లూరు అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని రైతులు, ఆడ బిడ్డలను మర్చిపోను. రాష్ట్ర విభజన జరిగి రాజధాని లేక, నిలువనీడ కూడా లేని సమయంలో కూర్చునేందుకు చోటు కల్పించి, భూములిచ్చిన మిమ్మల్ని మరిచిపోవడమంటే.. మీ త్యాగాలను మర్చిపోవడమే! ఒక్క పిలుపుతో వేల ఎకరాల భూములిచ్చారు. రాజధాని నిర్మా ణానికి దారిచూపారు. రాజధానిని కాపాడుకోవడానికి ఆడబిడ్డలు ఉద్యమించారు. రాజధానిని నిలుపుకోవడం కోసం మీ ఆరాటం, చేసిన పోరాటం, పడిన అవమానాలు, పడ్డ ఇబ్బందులు ఏవీ నేను మర్చి పోలేను. అందుకే రాజధాని రైతులకు రెట్టింపు గౌరవం కల్పిస్తా. వారికి అండగా నిలుస్తా' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజధాని అమరావతిలోని రాయపూడి గ్రామంలో ఏపీ సీఆర్డీఏ కార్యాలయం సోమవారం ఉద యం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యాలయంలోని సీఆర్డీఏ, సీడీఎంఏ, ఏడీసీఎల్, మినిస్టర్ చాంబర్లను ప్రారంభించారు. ఏడంతస్తులు తిరిగి కార్యాలయంలోని ఏర్పాట్లను పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేసిన ధ్యాన బుద్ధ లోహ విగ్రహాన్ని, రిసెప్షన్, క్యాంటీన్‌లను పరిశీలించారు. ఫస్ట్ ఫ్లోర్లోని కాన్ఫరెన్స్ హాళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని ల్యాండ్ పూలింగ్ కాన్సెప్టును తీసుకువచ్చి ఒక్క పిలుపు ఇస్తే వేల ఎకరాలు ఇచ్చి, ం `ాజధాని నిర్మాణానికి ముందుకు వచ్చిన

(మిగతా 8వ పేజీలో)



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, ప్రక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, కలెక్టర్ అన్సారియా, నారాయణ







సీఆర్డీఏ భవన నిర్మాణానికై స్థలం ఇచ్చిన రైతులు ఆలూరి గోపాలరావు, అలపర్తి నారాయణరావుకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సీఎం చంద్రబాబు



సీఆర్డీఏ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి వివరిస్తున్న కమిషనర్ కన్నబాబు



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు



రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలతో సీఎం

రైతులకు అసౌకర్యం కలగకూడదు

- ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి): ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పరిశీలించారు. సోమవారం మంగళగిరి మండలం కాజా గ్రామంలో రైతు సేవా కేంద్రంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు దశలు, సిబ్బంది చేపట్టాల్సిన అంశాలు, పరికరాల పని తీరు, రైతులకు చేసే సూచనలు, బస్తాల ఏర్పాటు, రవాణా చార్జీల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకు న్నారు. సమీపంలో ఉన్న వేయింగ్ బ్రిడ్జిని స్వయంగా తనిఖీ చేసి లెక్కింపు విధానాన్ని పరిశీలించారు. అన్నదాతకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని పౌర సరఫరాల సంస్థ, వ్యవసాయ శాఖ అధికా రులను ఆదేశించారు. ఏ రైతు వద్ద ఎంత ధాన్యము వస్తుందో ముందే పరిశీలించి, దానికి కావలసిన గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ వ్యవసాయ అధికారులు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు నియమించిన సాంకేతిక సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు ధాన్యం విక్రయించడానికి వచ్చే రైతులకు ఇబ్బందులు సృష్టించరాదని స్పష్టం చేశారు. రైతులు వారి ధాన్యాన్ని దళారుల ద్వారా అమ్మి మోసపోకుండా తగిన ఏర్పాట్లు జిల్లా వ్యాప్తంగా చేయాలని, అలా కాని పక్షంలో ఆయా సిబ్బంది మీద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కే తులసి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో చేపట్టే అంశాలను వివరించారు. ఖరీఫ్ 2025-26 సంవత్సరంలో గ్రేడ్-ఏ రకా నికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,369 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. జిల్లాలో మొత్తం 177 రైతు సేవ కేంద్రాలను 45 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, కల్లాల వద్ద ధాన్యం వాహ నాల్లోకి ఎక్కించటానికి అయ్యే హమాలి ఖర్చు, మిల్ పాయింటుకు చేర్చడానికి రవాణ ఖర్చు ప్రభుత్వమే భరి స్తుందని, ఒకవేళ రైతులు సొంతంగా ఈ ఖర్చులు పెడితే ధాన్యం ఖరీదుతో పాటు వారి అకౌంట్లో 21 రోజుల లోపు జమ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఎదురైన, కం ట్రోల్ రూమ్ నంబర్ 9491392717ను సంప్రదించి సమస్యలను పరిష్కరిం చుకోవచ్చని తెలిపారు.



ధాన్యం కొనుగోళ్ల పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

శనగ.. సాగు ఎలా?



నరసరావుపేట ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించింది. దీనికి ప్రయత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, శనగ సాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. కొన్ని చోట్ల పత్తి కూడా సాగు చేశారు. అయితే ఈ మధ్య కాలంలో కురిసిన అధిక వర్షాలతో పత్తి పంట దాదాపు ఉరకెత్తింది. దీంతో పత్తి పంటను కూడా తొలగించి శనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే శనగ విత్తన కొరత రైతులను వేధిస్తోంది. ఇప్పటికే జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్ సంస్థకు శనగ సాగుకు సంబంధించి ఇడెంట్లు పంపినట్లు సమాచారం. కానీ ఇప్పటి వరకు ప్రభు త్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు.

- రాయితీ విత్తనం కోసం రైతులు ఎదురు చూపు
- ఇండెంట్ ఇచ్చిన వ్యవసాయ శాఖ
- స్పందన కరువు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

గత ఏడాది పండించిన పొగాకుకు ధర లేక రైతులు దారుణంగా నష్టపోయారు. గత ఏడాది పల్నాడు జిల్లాలో 15,840 ఎకరాలు, బాపట్ల జిల్లాలో 65,180 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 11,175 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. దీంతో ధర లేక రై త ు లు అల్లా డుతున్న తరుణంలో, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇంకా కొంతమంది రైతుల ఇళ్లలోనే పొగాకు నిల్వలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం పొగాకు కొనడమే కాకుండా, పొగాకు సాగును నిషేధించింది. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రత్యామ్నాయంగా శనగ పంట వైపు మొగ్గు చూపారు. శనగ విత్తేందుకు పొలాలను సిద్ధం చేసిన అన్నదాతలు విత్తనం కోసం ఎదురు చూస్తున్నారు. ఏటా రబీలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో విస్తృతంగా శనగ సాగు చేస్తారు. గత ఏడాది బాపట్ల జిల్లాల్లో శనగ సాధారణ విస్తీర్ణం 74,572 ఎకరాలు. పల్నాడు జిల్లాల్లో 29,495 గుంటూరు జిల్లాలో 19,925 ఎకరాలలో సాగు చేశారు. పొగాకుపై నిషేధంతో ప్రత్యామ్నాయంగా శనగ సాగు చేపట్టే అవకాశాలు మొండుగా ఉండటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని వ్యవసాయ (మిగతా 6వ పేజీలో)



వెబ్‌ల్యాండ్ తిప్పలు

- రైతులకు రెగ్యులర్ ఖాతాలు రావడం లేదు
- మీ భూమి పోర్టల్‌లో పేర్లు నమోదు కాని పరిస్థితి
- భూమి అమ్ముకోవడం, బ్యాంకులో రుణం తీసుకోలేక ఇబ్బందులు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతు పేరు మీద భూమి రికార్డులు ఉన్నా మీ భూమి ఆన్‌లైన్ పోర్టల్‌లోకి ఖాతా నమోదు కావడం లేదు. దీంతో రైతులకు రెగ్యులర్ ఖాతాలు ఉండటం లేదు. వాళ్ల భూమి అంతా నోషనల్ ఖాతాల్లోనే ఉంటున్నది. దీంతో వ్యవసాయ భూముల ఆస్తిహక్కుదారులు తమ పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకోలేక పోతున్నారు. ఈ కారణంగా గత కొన్ని నెలల నుంచి రైతులు తమ భూములను అమ్ముకోవాలన్నా, బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణం తీసుకోవాలన్నా వీలుకాని పరిస్థితి. రైతులు నిత్యం తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. భూ పరిపాలన ముఖ్య కమిషనర్(సీసీఎల్‌ఏ) కార్యాలయమే ఎఫ్‌వీవో ఎల్‌ఆర్ (ఫీల్డ్ లెవల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) మాడ్యూల్‌ని నిలిపేసిందని, వాళ్లు మళ్లీ ఎనేబుల్ చేస్తే తప్పా తాము ఏమి చేయలేమని ఇక్కడి అధికారులు చేతులెత్తేస్తున్నారు.

వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు అనేది నిరంతర ప్రక్రియ. ఒక రైతు నుంచి వేరొకరు భూమిని కొనుగోలు చేసిన తర్వాత ఆ విస్తీర్ణాన్ని ఆన్‌లైన్‌లోకి నమోదు చేయించుకోవాలి. ఇందుకోసం సంక్లిష్టమైన ప్రక్రియే ఉన్నది. తొలుత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత సర్వేయర్ వచ్చి ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి చుట్టుపక్కల భూయజమానులతో విచారణ జరుపుతారు. అంతా సవ్యంగా ఉంటే ఎంఆర్‌వోకి నివేదిస్తారు. ఆ తర్వాత ఫైలు ఆర్‌డీవో వద్దకు వెళుతుంది. అక్కడ ఆర్‌డీవో అన్ని భూమి రికార్డులు, వెబ్‌ల్యాండ్ వివరాలను తెప్పించుకొని పరిశీలించి సవ్యంగా ఉన్నదని నిర్ధారించుకొని జాయింట్ కలెక్టర్ ఆమోదం కోసం పంపుతారు. జేసీ ఆ ఫైలుపై రిమార్కులు రాసి వివరణలు తీసుకొని ఓకే చేస్తారు. అప్పుడు ఫైలు మళ్లీ ఎంఆర్‌వో వద్దకు వస్తుంది. ఆ తర్వాత తన పేరుని ఆన్‌లైన్‌లో ఎక్కించమని రైతు చేత దరఖాస్తు చేయించి ప్రాసెసింగ్ చేస్తారు. చివరగా వెబ్‌ల్యాండ్‌లోకి భూమి కొలతలు, ఇతత వివరాలతో రైతు పేరు నమోదు అవుతుంది. అప్పుడు ఆయనకు రెగ్యులర్ ఖాతా విడుదల అవుతుంది.

గతంలో వెబ్‌ల్యాండ్‌లో పేర్లు ఎక్కించుకొన్న వాళ్లకు ఇదివరకే రెగ్యులర్ ఖాతాలు జారీ అయ్యాయి. ఎవరైతే వాళ్ల పేర్లను నమోదు చేయించుకోలేదో ఆ భూమి విస్తీర్ణం ఇతరులు(నోషనల్ ఖాతా)లో చేర్చారు. ఇప్పుడు భూమి కొనుగోలు చేసిన వాళ్లు ఫలాన సర్వే నంబరులో తమ భూమి సబ్ డివిజన్ జరిగిందని, ఆన్‌లైన్‌లో చేర్చమని దరఖాస్తు చేస్తున్నారు. నోషనల్ ఖాతాలో భూమి ఉన్నది. ఎంక్వయిరీ లోనూ వాస్తవమని నిర్ధారణ అయినప్పటికీ మీ భూమి వెబ్ ల్యాండ్ పోర్టల్‌లోకి పేర్లను నమోదు చేయలేకపోతున్నారు. ఇందుకు కారణం సీసీఎల్‌ఏ అధికారులు ఆ ఆప్షన్‌ని డిసేబుల్ చేశారు. దీంతో భూములు కొనుగోలు చేసిన వాళ్లు వెబ్‌ల్యాండ్ ప్రక్రియ పూర్తికాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోమ్యుటేషన్ కూడా జరగడం లేదు.



మీ భూమి పోర్టల్‌లో మ్యూటేషన్ జరగని పరిస్థితి

ఏఎంసీల మెరుగునకు.. మాస్టర్ ప్లాన్

- మార్కెట్ కమిటీ స్థలాల్లో కోల్డ్‌చైన్, అగ్రి ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు
- సీఎం ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ కసరత్తు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు త్వరలో మాస్టర్‌ప్లాన్‌లు రూపుదిద్దుకోనున్నాయి. పేరుకు నియోజకవర్గంలో ఒక ఏఎంసీ ఉన్నప్పటికీ కేవలం ఫంక్షనల్ యార్డుల్లోనే లావాదేవీలు జరుగుతోన్నాయి. మిగతా కమిటీలన్ని పా డుబడినట్లుగా ఉంటున్నాయి. ఆయా కమిటీలు కేవలం చెక్‌పోస్టుల ద్వారా వచ్చే ఆదాయానికే పరిమితం అవు తున్నాయి. ఈ నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌ల రూపొం దించడం ద్వారా మార్కెట్ కమిటీల్లో ఖాళీగా ఉన్న భవ నాలు, స్థలాలను ప్రాసెసింగ్ అవసరాలకు వినియోగిం చి తద్వారా వాటి ఆదాయం పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు మార్కెటింగ్ అధికారులు జిల్లాలోని ఏఎంసీలకు మాస్టర్‌ప్లాన్‌లను రూపొందించేందుకు కసరత్తు చేస్తోన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. వీటిల్లో కొన్ని మాత్రమే ఫంక్షనల్‌గా గుర్తింపు పొందాయి. గుంటూరు, దుగ్గిరాల, పొన్నూ రు, తెనాలి, మంగళగిరి వంటి ఏఎంసీలలోనే వ్యవసా య ఉత్పత్తుల లావాదేవీలు జరుగుతుంటాయి. మిగతా ఏఎంసీలలో ఖాళీస్థలాలు బోలెడన్ని ఉన్నాయి. ఫిరంగి పురంలో అయితే ఏకంగా ఈవీఎంల గోడౌన్‌కి అక్కడి ఏఎంసీ భవనాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యం లో మాస్టర్‌ప్లాన్‌లు రూపొందించడం వలన ఎన్ని భవ నాలు ఉన్నాయి, ఖాళీ స్థలాలు ఎంత విస్తీర్ణంలో అందు బాటులో ఉన్నాయి, గోడౌన్ల సంఖ్య వంటి వాటన్నింటిపై స్పష్టత వస్తుంది. దాంతో కోల్డ్‌చైన్ కేంద్రాలను నిర్మించేందుకు అవకాశం ఉంటుంది.

ఈ కోల్డ్‌చైన్ కేంద్రాలలో రైతుల పంట ఉత్పత్తులు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చు. అలానే సరుకుల విక్రయం జరిగిన తర్వాత కోల్డ్‌చైన్ కేంద్రం నుంచి గమ్యస్థానం వరకు నిర్ణీత ఉష్ణోగ్రతలో రవాణ చేయడా నికి వాహనాలుంటాయి. అలానే అగ్రి ప్రాసెసింగ్ సెంటర్లు అనేవి మనకు ఎక్కడా లేవు. వీటి ఏర్పాటు ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువని జోడించొచ్చు. ఇతర రాష్ట్రాలు, దేశాలు మన వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లి అక్కడ ప్రాసెసింగ్ చేసుకొని అధిక లాభాలు గడిస్తోన్నాయి. ఉదాహరణకు మిర్చిలో తేమ శాతం అధికంగా ఉంటే రైతుకు ధర తగ్గించేస్తారు. అదే యార్డులో డ్రైయింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తే అక్కడే రైతులు మిర్చిని ఆరబెట్టించుకొని విక్రయించుకోవచ్చు. ఇలా అన్ని రకాల పంటలను ప్రాసెసింగ్ చేసి ఎగుమతులు చేస్తే అధిక లాభాలు గడించొచ్చని సీఎం చెప్పారు. దాంతో మాస్టర్‌ప్లాన్‌లను ఏ సంస్థతో తయారు చేయించాలనే దానిపై మార్కెటింగ్ శాఖ అధ్యయనం చేస్తున్నది.



ఫిరంగిపురం ఏఎంసీలో ఖాళీగా ఉన్న భవనాలు

జీఎస్‌టీ 2.0పై.. జిల్లా ఉత్సవ్

- జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0పై విని యోగదారులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్, జీఎస్‌టీ నోడల్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు ఏసీ కళాశాల ప్రాం గణంలో ఉత్సవ్ జరుగుతుందన్నారు. 16వ తేదీ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ ద్వారా అమ్మకాలు జరుగుతాయన్నారు. వీటిలో గృహోపకరణాలు, క్రీడా పరికరాలు, మెట్రాస్, జిమ్ ఫిట్నెస్, సోలార్, బుక్స్‌స్టేషనరీ, కెమిస్ట్ డ్రగ్గిస్ట్‌తో పాటు అన్ని రకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులు తది తర వాటికి సంబం ధించిన దాదాపు 70 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఏఎన్‌యూ వీసీగా సత్యనారాయణ రాజు



ఏఎన్‌యూ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఏఎన్‌యూకు ఆచార్య సత్యనారాయణరాజును నూతన వీసీగా నియమించింది. ఈ మేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ఈ నెల 8న ఆయన నియామకానికి సంబంధించిన జీవోను జారీ చేసింది. వీసీగా ఆచార్య సత్యనారాయణరాజు నియామకం ఈ నెల 8 నుంచి అమల్లోకి వస్తుందని జీవోలో పేర్కొంటూనే తాత్కాలిక వీసీని రిలీవ్ చేసినట్లు మరో ఉత్తర్వు జారీ చేసింది. నూతన వీసీ రాక కాస్త ఆలస్యమవడంతో వర్సిటీ వర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన ప్రస్తుతం వీసీగా పనిచేస్తున్న బందా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీలోనే ఉండిపోతారా అని వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే సోమవారం సత్యనారాయణ రాజు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ నెల ఆఖరుకు వీసీ గా బాధ్యతలు చేపడతానని తెలిపారు.

గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్



గుంటూరు సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ టెక్‌ను విశాఖకు తీసుకురావటం వల్ల అమరావతి ఐటీ హబ్ గా మారుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. సోమవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గూగుల్ రాకతో రాష్ట్ర యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అభివృద్ధి అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు అని, గతంలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొస్తే నాడు దాని విలువ తెలియక పెదవి విరిచినా నేడు అది ఎందరికో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. ఏపీలోని యువతకు ఉద్యోగాలు కల్పించి రాష్ట్రం అభివృద్ధి చెందటానికి చంద్రబాబు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. విశాఖ త్వరలో ఏఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారనుందని చెప్పారు. ప్రపంచంలోనీ ప్రముఖ సంస్థలతో చర్చలు జరిపి నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. పెట్టుబడి పెట్టే సంస్థలను అడ్డుకునేందుకు ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా అవి ఆగవని సురేశ్ కుమార్ స్పష్టం చేశారు.

ప్రకాశం బ్యారేజీలో కొనసాగుతున్న వరద ఉధృతి



తాడేపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 73,796 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 60,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7,431 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6,034 క్యూసెక్కులు, గుంటూరు చానల్ కాలువకు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్‌లో 2 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



సాగర్‌లో 2 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో అధికారులు సోమవారం 2 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటి మట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7684 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,008 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 16,158 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 68,090 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 68,090 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాల నుంచి 58,122 క్యూసెక్కులు

రెంటచింతల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ నుంచి పులిచింతలకు 58,122 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు సోమవారం తెలిపారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 49,389 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని చెప్పారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు. ప్రాజెక్టులో ఆదివారం వరకు 0.9558 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారి ధర్మకర్తల పాలక మండలి ప్రమాణం



పాలకమండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి తదితరులు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి ఎన్నికైన నూతనపాలకమండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం ధర్మకర్తల పాలక మండలి చైర్మన్‌గా కలకోట చక్రధర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా కె.నాగమణి, ఏవీ పద్మజ, ఎన్.సముద్రాలు, వై.వెంకటప్పయ్య, ఎ.ఉషారాణి, కె.పట్టాభిరామారావు, కె.అశోక్, కె.శివలీల, వక్కలగడ్డ ప్రసాద్, సి.హెచ్.రాంబాబు, అదనపు సభ్యులుగా డి.బల్లారెడ్డిలతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లింగోద్భవస్వామి దేవస్థానం చైర్మన్ పరిమి రామకృష్ణసాయిబాబు, శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ యెండూరి సాయిగుప్తా, మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కనుమూరి సాంబమూర్తిరాజు, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, కోమలి సొసైటీ అధ్యక్షుడు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, దోమా నాగేశ్వరరెడ్డి, కూటమినాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఏవోల ప్రమోషన్లకు లైన్ క్లియర్

● 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

గుంటూరు సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఏవో (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)ల ప్రమోషన్ల ఫైల్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా వారి పదోన్నతులకు సోమవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నోట్ ఫైల్‌కు చైర్‌పర్సన్ ఆమోదం తెలపటంతో మిగిలిన ప్రక్రియ ఆరంభమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతి లభించనుంది. మంగళవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈవో వీర్ల జ్యోతి బసు ప్రమోషన్లకు సంబంధించిన ఉత్తర్వులను అందించనున్నారు.

టూత్ పేస్టుగా పొరబడి..

● ఎలుకల మందుతో పళ్లు తోముకొని మహిళ మృతి

నాదెండ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): టూత్ పేస్టు అనుకొని ఎలుకల మందుతో పళ్లు తోముకొని ఓ మహిళ మృతి చెందింది. సాతులూరులో ఈ నెల 8వ తేదీన జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నాదెండ్ల ఎస్ఐ జీ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం, సాతులూరు గ్రామానికి చెందిన జెట్టిపతి పోలేరమ్మ (69) ఇంట్లో ఉన్న ఎలుకల మందును టూత్‌పేస్టుగా భావించి పళ్లు తోముకుంది. ఆమె అస్వస్థతకు గురి కావటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమ వారం పోలేరమ్మ మృతి చెందింది. మనుమడు మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి అరెస్టు

● కేజీ 70 గ్రాముల గంజాయి, బైక్, మొబైల్ స్వాధీనం

నకరికల్లు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ మరో వ్యక్తి పట్టుబడ్డాడని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ తెలిపారు. సోమవారం నకరికల్లు పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నకరికల్లు శివారు శ్రీరాంపురం వద్ద రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన పోలిశెట్టి నాగరాజు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అతన్ని అదుపులోకి తీసుకొని సోదాలు చేయగా కిలో 70 గ్రాముల గంజాయి లభ్యమైందని తెలిపారు. దాన్ని స్వాధీనం చేసుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గంజాయి అమ్మగా వచ్చిన డబ్బుతో అతడు కొత్తగా కొనుగోలు చేసిన బైక్‌ను, మొబైల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నాగరాజు అరెస్టుతో గంజాయి కేసులో ఇప్పటివరకు మొత్తం పది మంది దొరికారని రూరల్ సీఐ చెప్పారు. ఈ కేసులో ఉన్న మరో ఏడుగురిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ కిరణ్ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

న్యాయవాద కోర్సుల పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న పీజీ పరీక్షల కోఆర్డినేటర్ సుబ్బారావు

ఏఎన్‌యూ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సోమవారం మాస్టర్ ఆఫ్ లా (ఎల్ఎల్ఎం) ద్వితీయ సెమిస్టర్, ఐదు సంవత్స రాల ఆనర్స్ బీబీఏ ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎల్ఎల్ఎం పరీక్షలు ఏఎన్‌యూతో పాటు, గుంటూరులోని జేసీ కాలేజ్ ఆఫ్ లా, ఏసీ కాలేజీ పరీక్షా కేంద్రాలలో కొనసాగుతున్నాయి. ఐదు సంవత్సరాల ఆనర్స్ పరీక్షలు విశ్వవిద్యాలయంలోని టీటీఎం విభాగంలో ప్రారంభమయ్యాయి. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక తనిఖీల బృందాలను నియమించినట్లు పీజీ పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం సుబ్బారావు తెలిపారు. వర్సిటీలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను సందర్శించి ఆయన తగు సూచనలు అందించారు.

గూడవల్లి ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గూడవల్లిలోని టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐలో మిగిలి ఉన్న సీట్లకు 5వ విడత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఐటిఐ.ఏపి.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతి మార్కుల ఆధారంగా ఈ నెల 17న కళాశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9398650408ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో కలకలం

● జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా రాజీనామా

గుంటూరు సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో కలకలం రేగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆవిర్భావం నుంచి ఆయన అందులో చాలా కీలకంగా వ్యవహరించారు. జిల్లా కమిటీ నిర్మాణ విషయంలో కూడా ఎక్కువగా పాటుపడ్డారు. చాంద్ బాషా గుంటూరులోని ఖజానాశాఖలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నందున ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా వెంటనే ఆయన దగ్గరకు వచ్చేవారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చాలా సందర్భాల్లో ఉన్నత అధికారుల వద్ద నుంచి ఆయన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా జరిగిన బదిలీలలో ఆయనను అధికారులు కక్షపూరితంగా మంగళగిరి బదిలీ చేశారని, ఆ విషయంలో రాష్ట్ర కమిటీ నాయకులు సరిగ్గా స్పందించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. బాషా రాజీనామాకు అదే కారణం అని తెలుస్తుంది. ఆయన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా ఇంచార్జిగా జి.నాగసాయిని నియమించారు.

నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి కేంద్ర బృందం



నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం

పొన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని సోమవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలు, ఇన్ అండ్ అవుట్ వైద్య సేవల విభాగాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ రకాల వ్యాధులకు అందించే సేవలు ఉచితంగా పంపిణీ చేసే మందుల వివరాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు డాక్టర్ ముహిర్దీన్, డాక్టర్ ఎడ్వర్డ్, గణేశ్ మారిముత్తు, నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గోళ్ళ అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

● మాదిగ సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘాల జేఏసీ నాయకులు పేరుపోగు వెంకటేశ్వరరావు తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ, పొలిమేర హరికృష్ణ, వేజండ్ల సుబ్బారావు మాదిగ మాట్లాడుతూ, తురకపాలెంలో ఎమ్మెల్యే చొరవతో గ్రామ ప్రజలకు వైద్య చికిత్సను అందజేశారని చెప్పారు. అంతేగాక బాధిత కుటుంబాలకు పరిహారం అందించేందుకు కృషి చేశారని తెలిపారు. అటువంటి వ్యక్తిపై నోరు పారేసుకోవడం సరైంది కాదని అన్నారు. దళిత ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు జోలికి వస్తే ఊరోకోమని హెచ్చరించారు. ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు దిగుతామని చెప్పారు. ఈ సమావేశంలో వాడవల్లి రాంబాబు, వెంకన్న మాదిగ, బుజ్జి, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వర్ల శ్రీను (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండమోడు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజుపాలెం మండలం పెదనెమలిపురి గ్రామానికి చెందిన వర్ల శ్రీను (49) మృతి చెందినట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. వర్ల శ్రీను పెదనెమలిపురి గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. మృతుడు శ్రీను భార్య రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శనగ.. సాగు ఎలా..?

(5వ పేజీ తరువాయి)

శాఖ అంచనా వేసింది. ఇప్పటికే విత్తనాల కోసం ఇండెంట్లు పంపింది. దీనిపై ఏపీ సీడ్స్ నుంచి ఉలుకు పలుకు లేదు. విత్తన సరఫరా జాప్యం జరుగుతోందన్న అభిప్రాయం వ్యవసాయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

శనగకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 225 పెంపు

కేంద్ర ప్రభుత్వం శనగకు మద్దతు ధరను పెంచించింది. క్వింటాకు రూ 225 పెంచింది. గత రబీలో క్వింటాకు రూ 5,650గా ఉన్న మద్దతు ధరను ప్రస్తుత రబీ సీజన్‌లో 5,875కి పెంచింది. మద్దతు ధర పెరగడం శనగ సాగుకు కలిచివచ్చే అంశంగా ఉంది.

రాయితీ 25 నుంచి 50 శాతానికి పెంచాలి

వైసీపీ ప్రభుత్వం శనగ విత్తనం రాయితీని 50 నుంచి 25 శాతంకు తగ్గించింది. కూటమి ప్రభుత్వం కూడా గత ఏడాది శనగ విత్తనంకు 25 శాతం రాయితీని కొనసాగించింది. పంట మార్పిడి చేసే నేపథ్యంలో విత్తన రాయితీని పెంచాల్సి బాధ్యత ప్రభుత్వం పై ఉందని రైతులు కోరుతున్నారు. 50 శాతం రాయితీపై ఎకరాకు 40 కేజీల చొప్పున శనగ రాయితీపై విత్తన సరఫరాను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.ప్రభుత్వం గత ఏడాది కిలోకు రూ.23.50 25శాతం రాయితీని అందించింది. 50 శాతంకు రాయితీ పెంచితే కిలోకు రూ 47 సబ్సీడీ రైతులకు అందే అవకాశం ఉంటుంది. ఎకరాకు శనగ విత్తనంకు రూ 1,880 రాయితీ రైతులకు లభించే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

54,702 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 55,844 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 54,702 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,857 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14800	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10500	14000	నెంబరు. 5	10000	14500
341	10000	15500	341	10000	15600
4884	----	----	4884	10000	14200
సూపర్ 10	----	----	సూపర్ 10	-----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15200
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15600	దేవనూరు డీలక్స్	10500	14700
దేవనూరు డీలక్స్	10000	14800	తాలుకాయలు	5000	7700

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలి, జడ్పీసీఈవో జ్యోతిబసు తదితరులు

సంతృప్తి స్థాయిని పెంచేలా ఫిర్యాదుల పరిష్కారం

● డీఆర్వో షేక్ ఖాజావలీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సంతృప్తి స్థాయిని మరింతగా మెరుగుపరిచేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో షేక్ ఖాజావలి సూచించారు. సోమవారం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మొత్తం 228 అర్జీలు అందాయి. కలెక్టర్, జేసీ అందుబాటులోకి లేకపోవడంతో డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్‌తో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖలు, పరిష్కార దిశగా తీసుకుంటున్న చర్యలను నిరంతరం ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర బాబు, పశుసంవర్ధక శాఖ జేడీ ఏ.సత్యనారాయణ, డీటీసీ సీతారామిరెడ్డి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

● మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ దళిత బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. పీపీపీ విధానంలో కళాశాలలను నిర్వహిస్తే దళిత విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో పాటిబండ్ల కోటేశ్వరరావు, చారువాక, భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు, బండ్లమూడి స్టాలిన్, చిన్నం డేవిడ్ విలియన్స్, బత్తుల వీరాస్వామి, నల్లపు నీలాంబరం తదితరులు ఉన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పనిచేసే పారిశుద్ధ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. నాలుగు నెలల నుంచి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో దండా లక్ష్మీనారాయణ, కే.అంజలి, ఆర్.రాజ్యలక్ష్మి ఉన్నారు.

పెట్రోల్‌తో పీజీఆర్ఎస్‌కు యువకుడు



పెట్రోల్ సీసాతో కలెక్టరేట్‌కు వచ్చిన భాను ప్రకాష్

సిటి బస్సుల యజమానులు వేధిస్తున్నారని స్థానిక స్వర్ణభారతి నగర్‌కు చెందిన సీహెచ్ భానుప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని పెట్రోలు సీసాతో ఆయన కలెక్టరేట్‌కు వచ్చాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సీసాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భానుప్రకాష్ మాట్లాడుతూ నగరంలోని ఓ సిటీబస్సుకు కండక్టర్‌గా పనిచేస్తున్నానని, యాజమాన్యంకు డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో వారు తనను పలుమార్లు బెదిరించారని వాపోయాడు. తీరా డబ్బులు చెల్లించిన తర్వాత కూడా తనను బెదిరిస్తూ తనపై దాడి చేస్తున్నారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలి

● నగర మేయర్, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ లో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని, ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువు మేరకు పరిష్కారం చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరిగిన పీజీఆర్ఎస్‌లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 28 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా మేయర్ తో కలిసి ప్రజల నుండి అర్జీలు తీసుకొన్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 47 అర్జీలు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ, బాషా పాల్గొన్నారు.

16లోగా నిధి పోర్టల్లో చెల్లింపులు చేపట్టాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్,అధికారులు

నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధి పోర్టల్‌లో ఈ నెల 16వ తేదీలోపు బిల్లుల చెల్లింపులు చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బిల్స్ నిధి పోర్టల్లో అప్ లోడ్ అంశంపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తమ చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొన్నారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు పారదర్శకంగా ఉండేందుకు నిధి పోర్టల్లో ఆన్ లైన్ ద్వారా అప్ లోడ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ బిల్లులను నిధి పోర్టల్‌లో అప్ లోడ్ చేయడంలో ఏఈలు జాప్యం చేస్తున్నారని, 16వ తేదీ అనంతరం పెండింగ్ ఉండే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రా మిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, వేణుగోపాల్, విష్ణు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

నగర శివారు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని 25వ డివిజన్ వీబీపీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అలాగే కావేరి నగర్‌లో మురుగు నీరు పారుదల సరిగా లేదని ప్రజల నుండి అందిన ఫిర్యాదు మేరకు సదరు ప్రాంతంలో పర్యటించి, తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, ఏఈ ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డివైడర్లలో ఆహ్లాదాన్ని అందించే మొక్కలు నాటాలి

నగరంలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఆహ్లాదాన్ని అందించే మొక్కలను నాటాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఉద్యాన విభాగ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ జేకేసీ కాలేజీ రోడ్డు, సమ్మర్ పేట, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా వార్డుల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మిర్చి లారీలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు

● రవాణా, పోలీసు అధికారులు పెట్రోలింగ్ చేయాలి

● జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశాలు



మిర్చి ట్రేడర్లు, లారీ యజమానులతో సమావేశమైన జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాలకు మిర్చి లారీల రవాణ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెడితే వాళ్లపై కఠిన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆయన ఏఎంసీ, రవాణ, పోలీసు శాఖలతో పాటు మిర్చి ఎగుమతిదారులు, లారీ యజమానుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. మిర్చి ట్రేడర్లు మాట్లాడుతూ ఖమ్మం ఏఎంసీ నుంచి లారీ కిరాయి రూ.1.38 లక్షలకు పెడుతున్నారని చెప్పారు. ఇక్కడ రూ.1.70 లక్షలు అడుగుతుండటంతో కొంతమంది బయ్యర్లు ఇప్పటికే ఖమ్మం వెళ్లి 10 లారీలు ఎగుమతి చేశారని తెలిపారు. లారీ యజమానులు మాట్లాడుతూ తమ సమస్యపై ఎమ్మెల్యే మాధవి చర్చిస్తున్నారని చెప్పారు. హైట్, ఎక్కువ లోడింగ్‌ల వలన భారీగా పెనాల్టీలు కట్టాల్సి వస్తోందన్నారు. అలానే టోల్‌గేట్ ఛార్జీలు పెరిగాయన్నారు. మిర్చియార్డులో గుమస్తా మామూలు పేరుతో రూ.7 వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాలకు ఎంత కిరాయికి అయితే లారీలు పెడుతున్నారో అంతే మొత్తానికి సప్లై చేయాలన్నారు. అంతకు మించి కిరాయిలు పెంచుతాం, మిర్చి రవాణకు లారీలు పెట్టకుండా అడ్డుకొంటామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో పోలీసులు, రవాణ శాఖ అధికారులు ముమ్మరంగా పెట్రోలింగ్‌లు నిర్వహించాలన్నారు. ఎవరైనా లారీలు పెట్టకుండా అడ్డుకుంటుంటే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఖాజావలి, ఉప రవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ.చంద్రిక, ఇన్‌ఛార్జ్ సుబ్రహ్మణ్యం, గ్రేడ్-3 సెక్రెటరీ శ్రీకాంత్, మిర్చి ఎగుమతిదారులు జుగిరాజ్ భండారి, తోట రామకృష్ణ, కొత్తూరి సుధాకర్, లారీ యజమానుల తరుపున ఈ శ్రీనివాస్, కే వేమారెడ్డి, ఎస్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్స్ ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డాక్టర్ మోజెష్ తదితరులు

ఎంజే మాణిక్యరావు శతజయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు (విద్య), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అధ్యాపక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎంజే మాణిక్యరావు శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంజే మాణిక్యరావు మెమోరియల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ లక్ష్మణరావు, డాక్టర్ కొమ్మాలపాటి మోజస్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఏసీ కళాశాలలో పోస్టర్స్ ఆవిష్కరించారు. శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం విజయకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గోళ్ల అరుణ్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలని జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక విద్యానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు నెలలుగా రాని గోళ్ల అరుణ్‌కుమార్ ఇప్పుడు ఎందుకు వచ్చాడని ప్రశ్నించారు. వాటాల కోసమా అని నిలదీశారు. మరోసారి నియోజకవర్గ విషయాల్లో తలదూర్చితే మహిళలతో దేహశుద్ధి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ప్రత్తిపాడు మార్కెట్ యార్డు ఛైర్మన్ బొందలపాటి అమరేశ్వరి మాట్లాడుతూ తొలి నుంచి తురకపాలెం బాధితులకు ఎమ్మెల్యే అండగా నిలబడ్డారని, ఆయనపై అసభ్య పదజాలం వాడిన గోళ్ల అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బురదగుంట వెంకట్రావు మాట్లాడుతూ ఎమ్మెల్యేపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నక్కల అగస్టీన్, బొడ్డుపల్లి స్మితపద్మజ, ప్రఖ్యాత తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో ఈనెల 18వ తేదీన జరిగే ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ 57వ మహాసభలను జయప్రదం చేయాలని డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ కోరారు. అరండల్‌పేట, ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. మహాసభల్లో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన దాదాపు 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. మహాసభలను సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సతీష్ ప్రారంభిస్తారని, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు ప్రసంగిస్తారని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.సైదులు, శ్రీనివాస్, గోపాలకృష్ణ, మధుబాల, రాజశేఖర్, విజయ, రాఘవ, వెంకట్రావు, ఉషాబాల, పి.శ్రీదేవి పాల్గొన్నారు.

గాంధీజీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

గుంటూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీపై సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ విద్యార్థి అనుబంధ విభాగం ఎన్ఎస్‌యూఐ నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో నాజ్ సెంటర్‌లోని థియేటర్ ఎదుట నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ నటించిన ఆరి సినిమా పోస్టర్లకు నల్లరంగు పూసి దగ్ధం చేసి నిరసనకు దిగారు. ఈసందర్భంగా కరిముల్లా మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీని ఉద్దేశించి తెలుగు సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ అనుచిత వ్యాఖ్యలు చేయటం దుర్మార్గమన్నారు. ఇటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఏపీఎస్‌పీఎఫ్ క్రీడా పోటీలు

గుంటూరు(క్రీడలు) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఏపీఎస్‌పీఎఫ్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్నాయని ఏపీఎస్‌పీఎఫ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, డీఎస్పీ ఆర్‌వీఎస్ఎన్ మల్లికార్జున రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబరు 23న జరగనున్న 34వ ఏపీఎస్‌పీఎఫ్ వ్యవస్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విభిన్న యూనిట్లలో పనిచేస్తున్న క్రీడాకారులు, అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, 5 కి.మీ పరుగు మొదలైన ఈవెంట్లలో పాల్గొంటారని చెప్పారు. ఈ క్రీడల ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలకు రాష్ట్ర హోం మంత్రి, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని వివరించారు.

వృత్తి వంట మాస్టర్... ప్రవృత్తి సైబర్ క్రైమ్

● నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆయన విద్యార్హత ఇంటర్మీడియట్.. వృత్తి వంట మాస్టర్. కానీ ప్రవృత్తి సైబర్ నేరాలు... ఈ వ్యక్తి గడిచిన కొంతకాలంగా వరుస సైబర్ నేరాలకు పాల్పడుతూ అమాయకులను నిలువునా దోచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన రైస్ మిల్లు నిర్వాహకుడు నెల్లూరు వెంకటేశ్వరరావు వద్ద కోటి రూపాయలకు పైగా కొల్లగొట్టిన కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇంకొల్లుకు చెందిన ఈ సైబర్ నేరగాడు బెంగళూరులో ఉంటూ అక్కడ హోటల్లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులకు చెందిన బ్యాంకు ఖాతాలకు సైబర్ క్రైమ్ ద్వారా వచ్చిన నగదు మళ్ళించి వాటిని క్రికెట్ బెట్టింగ్స్‌కు పెడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు ఇతను పెద్ద ఎత్తున సైబర్ నేరాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. రైస్‌మిల్లు నిర్వాహకుడు నెల్లూరు వెంకటేశ్వరరావు నుంచి కొల్లగొట్టిన కోటి రూపాయలను క్రికెట్ బెట్టింగ్‌లో పోగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక మందిని ఇదేవిధంగా మోసం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

లాటరీ, వ్యభిచార గృహాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

● నలుగురు అరెస్టు... నగదు, సెల్‌ఫోన్‌లు సీజ్

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సీఐ ఆళహరి శ్రీనివాస్ పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ దాడులు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా సోమవారం లాలాపేట పోలీస్ పరిధిలోని ఏటుకూరు బైపాస్ రోడ్డు సమీపంలో ఆటోలో కూర్చుని సింగిల్ నంబర్ లాటరీ ఆడుతున్న నలుగురిని లాలాపేట పోలీస్ సిబ్బంది సహకారంతో అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి లాటరీ టికెట్ల పుస్తకాలు, 3 సెల్ ఫోన్లు, రూ.4 వేల 700 నగదు సీజ్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం లాలాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఇంటిపై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక దాడి నిర్వహించింది. దీనిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు గుర్తించి, ఇద్దరు నిర్వాహకులు, అలాగే ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారన్నారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు టీచర్స్ కాలనీలో....

స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు టీచర్స్ కాలనీలో ఓ ఇంటిలో వ్యభిచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న బండ్ల బాలానంద కుమార్, తులసి దంపతులతో సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన సమాచారంతో సోమవారం ఆ ఇంటిపై దాడి చేసి నిర్వాహకులైన బాలానంద కుమార్, తులసిలతో పాటు పశ్చిమ బెంగాల్ చెందిన ఓ యువతిని, నకరికల్లు మండలానికి చెందిన మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

చీటీ పాటల బాధితులకు కోటికి పైగా టోపీ

● కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి అదృశ్యం

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కూలి పనులకు వెళ్లి కూడబెట్టుకున్న డబ్బులను చీటీలు వేస్తే నిర్వాహకులు రూ.కోటికిపైగా టోపీ పెట్టి ఇంటికి తాళం వేసి అదృశమయ్యారని బాధితులు వాపోయారు. వర్షం, సీఎం పర్యటన బందోబస్తుకు అధికారులు వెళ్లడంతో సోమవారం పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేశారు. దీంతో బాధిత మహిళలు నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏటీ అగ్రహారం 13వ లైన్‌కి చెందిన కర్ణాటక అన్నపూర్ణ అలియాస్ చిన్నారి, ఆమె కూతురు సాయి దివ్య, నరసమ్మ, నాని, సుధాకర్, మహేష్ అనే వారి వద్ద తాము చీటీలు వేయగా రౌడీలతో తమను బెదిరించారని ఏటీ అగ్రహారానికి చెందిన బాధిత మహిళలు దుర్గ, సీత, ఉషారాణి, విష్ణు ప్రియ, రమణ, లక్ష్మీ, నరసింహ, సుబ్బాయమ్మ, లాలూ నాయక్ తదితరులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నపూర్ణ, ఆమె కుటుంబ సభ్యులు సుమారు 20 సంవత్సరాలుగా స్థానికంగా చీటీ పాటలు వేస్తున్నారన్నారు. వారికి ఏడు, ఎనిమిది ఇల్లు వరకు ఉన్నాయన్నారు. రెండు దశాబ్దాలుగా నమ్మకంగా చీటీ పాట నిర్వహిస్తుండడంతో పాటు స్థానికంగా స్థిరాస్తులు ఉండడంతో తామంత వారిని నమ్మి చిట్టీలు వేశామన్నారు. చీటీ పాటలు పూర్తయి 7 నెలలు అవుతున్నప్పటికీ ఇంతవరకు సభ్యులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేదన్నారు. తమకే కోటిన్నరకుపైగా ఇవ్వాల్సి ఉందన్నారు. పోలీసు అధికారులు తమకు న్యాయం చేయాలని బాధిత మహిళలు వేడుకున్నారు.



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డులో గల సూర్యదేవర నాగరాజు గోడౌన్‌లో పరంజాపై ఉండి పెయింట్ వేస్తూ జారిపడి జలాది సునీల్ కుమార్ (34) మృతి చెందాడు. నల్లపాడు పోలీసుల కథనం మేరకు ఏటీ అగ్రహారం జీరో లైన్‌కు చెందిన సునీల్ కుమార్ ఈనెల 6న ఏటుకూరు సమీపంలోని నాగరాజుకు చెందిన గోడౌన్‌కు పెయింట్ వేస్తూ పరంజపైనుంచి కాలుజారి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు ఆయనను నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ ఈనెల 12న పరిస్థితి విషమించడంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు.

తండ్రిని తిడుతోందని అమ్మమ్మ హత్య

● పోలీసుల అదుపులో ముగ్గురు మైనర్‌లు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొత్తూరులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళది హత్యగా తేలింది. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో పొత్తూరులో మునికి సింగమ్మ (55) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సింగమ్మది హత్యగా అప్పుడే అనుమానాలు వ్యక్తమయ్యాయి. సింగమ్మ భర్త శ్రీనివాసరావు గతంలోనే మృతి చెందాడు. పొత్తూరులోని చెరువు కట్టపై సింగమ్మ నివాసం ఉంటుంది. ఆమెకు రెండు పోర్షన్ల ఇల్లు ఉంది. ఒక పోర్షన్లో సింగమ్మ ఉంటుండగా మరో పోర్షన్‌ను అద్దెకిచ్చింది. ఆదివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో సింగమ్మ మృతి చెంది ఉండడంతో గమనించిన స్థానికులు 112కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. నల్లపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పొత్తూరులో సింగమ్మ కూతురు, అల్లుడు నివాసం ఉంటున్నారు. అయితే అల్లుడిని సింగమ్మ ప్రతిరోజూ అనవసరంగా తిడుతుంటుందని ఆయన కుమారుడు కక్షపెంచుకున్నాడు. సింగమ్మ ప్రవర్తనే సరిగా ఉండదని, అటువంటిది తన తండ్రి గురించి తప్పుడు ప్రచారం చేస్తుందని మనవడు మనసులో కక్ష పెంచుకుని అమ్మమ్మను చంపాలని నిర్ణయించుకున్నాడు. దీంతో తన బంధువు, తనకు దూరపు బంధువు అయిన ఇరువురు మైనర్‌లతో కలసి సింగమ్మ ఇంటికి వెళ్లి ఆమెతో గొడవపడ్డాడు. దీంతో ఆమె మనవడిపై చేయి చేసుకుంది. దీంతో వారు ఆమె నోరు, ముక్కు మూసి హత్య చేశారు. దీంతో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



స్టాల్‌లో వస్తువుల ధరలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

జీఎస్టీ 2.0తో పేద, మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0తో పేద, మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట లభిస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ను సందర్శించి, ప్రదర్శించిన వస్తువుల ధరల తగ్గింపును పరిశీలించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ 2.0 పన్ను సంస్కరణలు సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా తీసుకున్న కీలక నిర్ణయాలన్నారు. పన్ను రేట్ల తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గి, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం లభిస్తోందన్నారు. నాలుగు స్లాబ్‌లలో ఉన్న జీఎస్టీని కేంద్రం రెండు స్లాబ్‌లకు పరిమితం చేసిందని, ప్రజలకు నేరుగా లాభం చేకూరేలా 99 శాతం వస్తువులను 5 శాతం స్లాబ్‌లోకి చేర్చారని చెప్పారు. హెల్త్ ఇన్సూరెన్స్‌పై పన్నును పూర్తిగా తొలగించడం ద్వారా సామాన్యులకు వైద్య ఖర్చులు తగ్గాయన్నారు. ఇది నిజమైన ప్రజానుకూల నిర్ణయమని ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు.



కలెక్టరేట్ నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో ఖాజావలి

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజలకు వస్తు సేవల పన్ను తగ్గింపుపై అవగాహన కల్పించడానికి విస్తృత స్థాయిలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్వో ఖాజావలి మాట్లాడుతూ తగ్గిన పన్నుల శాతంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 19 వరకు నెల రోజులు వాణిజ్య శాఖతో పాటు, మునిసిపల్, వ్యవసాయ, చేనేత జౌళి, పరిశ్రమలు, పంచాయతీ, డీఆర్‌డీఏ, మెప్మా, కార్మిక శాఖలు ద్వారా సదస్సులు, ట్రేడ్ షోలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆశారాణి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కోసం నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ కలెక్టరేట్ నుంచి హిందూ కళాశాల సెంటర్, జిన్నా టవర్, బస్టాండ్, మంగళగిరి రోడ్డు మీదుగా ఆటోనగర్ వరకు కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కృష్ణవేణి, వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పెరగనున్న ప్రజల కొనుగోలు శక్తి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి దోహదపడుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల భవిష్యత్ ఆర్థిక ధోరణులు" అంశంపై సోమవారం అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసు అధ్యక్షతన ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపారవేత్తలతో సెమినార్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ వద్ద అమ్మే వస్తువులపై తగ్గిన జీఎస్టీ రేట్లను అమలు చేయాలన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాధారణ, మధ్య తరగతి వారికి నిత్యావసర వస్తువులపై జీఎస్టీ రద్దు ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. సెమినార్‌లో నగరంలోని ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపారవేత్తలు, జీఎంసీ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ బాలాజి బాషా తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ ఓబులేసు తదితరులు

దేశీయ ఉత్పత్తులనే వినియోగించాలి

● మెప్మా పీడీ విజయలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న మెప్మా పీడీ విజయలక్ష్మి

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశీయ ఉత్పత్తుల వినియోగం మన ఆత్మ గౌరవమని మెప్మా పీడీ విజయలక్ష్మి అన్నారు. గుంటూరు తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ నేతృత్వంలో సోమవారం మెప్మా ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులు వినియోగించాలని, ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలుస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని చెప్పారు. ప్రతి నెలా ఇంటి బడ్జెట్‌ను ఆదా చేస్తాయని, చిన్న వస్తువుల నుంచి పెద్ద కొనుగోళ్ల వరకు జీఎస్టీ తగ్గింపుతో లాభం చేకూరుతుందని వివరించారు. ఈనెల 18వ తేదీ వరకు జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పటికే ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.

పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సమర్థవంతంగా నిర్వహించాలి

గుంటూరు (విద్య), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించాలని రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు విజ్ఞప్తి చేశారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న పరీక్షా భవన్లో హిమాలయ వుడ్ బ్యాడ్జి ను సాధించిన ఉపాధ్యాయులను సోమవారం ఆయన సత్కరించారు ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఉపాధ్యాయులు మరిన్ని విజయాలు సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎస్ఓసి స్కౌట్ శ్రీనివాసరావు, ఎస్టీసీ గైడ్స్ ఉమాదేవి, వివిధ జిల్లాల స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సీఆర్డీఏ కార్యాలయంలో ఉద్యోగుల ఛాంబర్


విద్యుత్ ఆటోలను సీఎంకు చూపుతున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు


కార్యాలయంలో ఏర్పాటుచేసిన వివిధ విభాగాల వివరాలు తెలిపే సైన్‌బోర్డు

మీ త్యాగం మరువను!

(5వ పేజీ తరువాయి)

రైతుల త్యాగాలను ఆయన కొనియాడారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నిర్మిస్తున్న సెల్ఫ్ మానిటైజేషన్ నగరమని, విమర్శకులు ఆ విషయం గుర్తించాలని హితవు పలికారు. సీడ్ క్యాపిటల్, దాని చుట్టూ కోర్ క్యాపిటల్, ఆ తరువాత సీఆర్డీఏ రీజియన్‌లతో సింగపూర్ అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, దానితో రైతుల భవిష్యత్తు రాబోయే రోజుల్లో అద్భుతంగా మారుతుందని చెప్పారు. రైతులు అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని, వారి భూములను అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు. హైటెక్ సిటీ రాక ముందు ఎకరా లక్ష రూపాయలు ఉన్న భూములు ఇప్పుడు ఎకరా 170 కోట్లు ఉందని చెప్పారు. దీనిని బట్టి భవిష్యత్ నగరం ఎలా ఉండబోతోందో ఆలోచించుకోవాలన్నారు.రాజధాని గ్రీన్ ఎనర్జీతో కూడిన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఒక వైపు కృష్ణమ్మ, మరోవైపు పచ్చని చెట్లతో అద్భుత నగరంగా అమరావతి ఉండబోతోందన్నారు. రాజధానిలో అద్భుతమైన రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రాజధానిలోని ఏడు రోడ్లు నేరుగా ఇతర రాష్ట్రాలకు వెళతాయన్నారు. డ్రెయిన్లు, వాటర్ లైన్లు, విద్యుత్ లైన్లు అన్నీ ప్రత్యేకించి యుటిలిటీ డక్టుల్లో నిర్మిస్తున్నామని చెప్పారు. తద్వారా రేపటి అమరావతి అద్భుత నగరంగా మారబోతోందని చెప్పారు.

● అమరావతికి స్థల బలం..

దేవతల రాజధాని అమరావతి అయితే..


సీఆర్డీఏ కార్యాలయం ఫస్ట్ ఫ్లోర్ ఏరియల్ వ్యూ, రిసెప్షన్, విజిటర్స్ లాంజ్

మన ప్రజా రాజధాని అమరావతి అని సీఎం కొనియా డారు. దేశంలోని దేవాలయాల నుంచి మట్టి, పవిత్ర జాలలు తెచ్చి దేవుడి ఆశీస్సులతో ప్రారం భమైన నగరమని అన్నారు. సాక్షాత్తూ ప్రధాని పార్లమెంటులోని మట్టి, యమునా నదీ జలాలు తెచ్చి అమరావతికి తోడ్పాటునిచ్చారన్నారు. ఇప్పుడు కూడా రాజధానికి ప్రధాని ఎంతో తోడ్పాటునిస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత తనదేనని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆ బాధ్యతతోనే పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి పనిచేస్తున్నామన్నారు. 2047 వరకూ ఇదే ఒరవడి కొనసాగితే అమరా వతికి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. అప్పటి వరకూ ప్ర జలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

● త్యాగాల ఫలితాలు రైతులే అనుభవించాలి

రాజధాని కోసం రోడ్డెక్కి పోరాడిన అమరావతి మహిళా రైతుల త్యాగం మరవలేనిదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి, వారు పడ్డ అవమానాలు, బాధలు అన్నీ గుర్తేనన్నారు. అందుకే తాను కూడా జోలె పట్టి వారికి అండగా నిలిచామన్నారు. కష్టాలు మరిచిపోవద్దని, రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలన్నారు. ఫేజ్-1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారని గత పాలకులు రైతులను నానా హింసలు పెట్టారని సీఎం గుర్తుచేశారు. రాజధాని ఎడారని, స్మశానమనమని, వేశ్యల రాజధాని అనే స్థాయికి వారి ఉన్మాదం చేరిందని వాట న్నిటికీ సమాధానం చెప్పేలా రాజధానిని నిర్మి స్తానని చెప్పారు. రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా. రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తా' అంటూ సీఎం హామీనిచ్చారు. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యా లు సాధిస్తారన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, కొలికపూడి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధి కారులు పాల్గొన్నారు.

రాబందుల శాంతియాత్రలా వైసీపీ ధర్నాలు

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం పేరిట రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న ధర్నాలు రాబందుల శాంతియాత్రను తలపిస్తున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. 2019 నుంచి 2024 మధ్య ప్రజల ప్రాణాలను పీక్కుతున్నది ఎవరో అందరికీ తెలుసని పేర్కొన్నారు. సిట్ విచారణలో నాటి అక్రమాలు, అరాచకాలపై ఆధారాలతో సహా అడ్డంగా దొరికారని తెలిపారు. ఇప్పుడు వాటిని కప్పిపుచ్చుకోవడానికే లేనిపోని రాద్ధాంతాలు, వారికి అలవాటైన అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ తర్వాత ఇప్పటికే ఈడీ రంగప్రవేశం చేసిందని, వైసీపీ కోరుకుంటున్నట్లు సీబీఐ కూడా బరిలోకి దిగి వాళ్లను జైలులోకి నెట్టడం ఖాయమని అన్నారు. కల్తీ మద్యం తయారైంది వైసీపీ హయాంలోనేనని నిందితుడు జనార్దన్‌రావు చెప్పినా, కల్తీ మద్యంతో లాభాలు అర్జించుకుంది ఆ పార్టీ నాయకుడు జోగి రమేష్ అని తెలిసినా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కల్తీ మద్యం కేసులో నేడో రేపో జగన్‌రెడ్డి అరెస్టు ఖాయమని అన్నారు. రూ. 90 ఉన్న మద్యం సీసాను రూ.300కు అమ్ముకున్న బొల్లా బ్రహ్మనాయుడు కూడా దీనిపై మాట్లాడటం చాలా హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలో బెల్టు షాపులతో సమాంతర మద్యం వ్యవస్థను నడిపించింది ఆయన కాదా అని విమర్శించారు. సరఫరా చేసిన కల్తీ మద్యంపై కూడా సీసాకు ఇంతని బీ ట్యాక్స్ వసూలు చేశారని, ఆ విషయాన్ని మరిచిపోతే ఎలా అని జీవీ ప్రశ్నించారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి అనాగరికం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

● గుంటూరులో నిరసన ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం


నిరసన ర్యాలీలో పాల్గొన్న మంద కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి ప్రయత్నించడం అనాగరికమని, దానికి కారణమైన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గవాయిపై దాడిని నిరసిస్తూ గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, సీజేను అవమానించిన నిందితుడిని అరెస్టు చేయకపోతే దేశంలో సామాన్య దళిత ప్రజలకు రక్షణ, గౌరవం ఉండదని అన్నారు. దాడిని ఖండిస్తూ దేశ ప్రధాని స్పందించిన తీరును పూర్తిగా స్వాగతిస్తున్నామని చెప్పారు. దళితులు ఉన్నత స్థానాల్లో కూర్చోవడం కొంత మందికి గిట్టడం లేదని అందుకే దాడులకు తెగ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడి కాదని, రాజ్యాంగంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. ఇప్పటికైనా సీజే గవాయ్‌పై దాడిని ఢిల్లీ పోలీసులు తీవ్రంగా పరిగణించి నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా జాతీయ స్థాయిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తున్నట్లు ప్రకటించారు. ర్యాలీలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు, ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు కూచిపూడి సత్యం, ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణపల్లిలో కంప్యూటర్‌తో జాకెట్‌పై డిజైన్ వేస్తున్న మహిళ

పల్లెలకు పాకిన డిజైన్ వర్క్స్

● కంప్యూటర్ డిజైన్‌తో మహిళలకు ఉపాధి ● శుభకార్యాలకు పెరుగుతున్న రద్దీ

పిడుగురాళ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చీరలు, జాకెట్‌లపై మహిళలకు నచ్చే విధంగా వివిధ రకాల డిజైన్‌లను వేసి అందివ్వడం ఇప్పుడు పల్లెలకు పాకింది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఇలాంటి అధునాతన డిజైన్‌లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో కూడా ముద్ర రుణాలతో అందుబాటులోకి వచ్చాయి. పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, కోనంకి, జానపాడు గ్రామాలలో అనేక మంది మహిళలు తమకు అనుకూలంగా ఉండే వ్యాపారాలను ఇంటి వద్ద నుంచి కొనసాగిస్తూనే కుటుంబ ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఒకప్పుడు జాకెట్‌పై కంప్యూటర్ డిజైన్, మగ్గం వర్క్ వేయాలంటే పట్టణాలకు పోయి అధిక వ్యయం వెచ్చించాల్సి వచ్చేది. ఇప్పుడు ఎక్కడికక్కడ గ్రామీణ ప్రాంతాలలోనూ పట్టణాలకు దీటుగా చీర, జాకెట్‌లపై డిజైన్, మగ్గం వర్క్‌లు అందుబాటులోకి వచ్చాయి. మహిళలు, పొదుపు సంఘ సభ్యులు తమ కుటుంబ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ముద్ర, వడ్డీలేని, పావలా వడ్డీ రుణాలను ఉపయోగించుకొని తమ జీవన విధానం మార్చుకొని ఆదాయ మార్గాలవైపు అన్వేషిస్తున్నారు.

అన్నపర్రు ఘటనపై అధికారుల విచారణ

పర్యవేక్షణ లోపమే దీనికి కారణమంటూ ఆగ్రహం

పెదనందిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఇటీవల కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటనపై సోమవారం వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి, బీసీ సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర రాజు విచారణ చేపట్టారు. సంఘటనకు గల కారణాలను విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందిని అడిగి తె


సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్య ఆరోగ్య, బీసీ సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్లు

లుసుకున్నారు. ఇది పూర్తిగా పర్యవేక్షణ లోపమేనని, హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా లేవని దీని వల్లే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రతి రోజూ ఇలానే రుచికరంగా వండిపెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు తాగునీరు ఎక్కడి నుంచి సరఫరా అవుతుందని, నీటిని పరీక్షలు చేస్తున్నారా లేదా అని పంచాయతీ సిబ్బందిని ఆరా తీశారు. అస్వస్థతకు గురైన విద్యార్థి ప్రత్తిపాటి చిట్టిబాబును వైద్య పరీక్షలు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. సంఘటన సమయంలో అన్ని శాఖల అధికారులు తక్షణమే స్పందించడంతో పెనుప్రమాదం తప్పిందని అన్నారు. విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. వారి వెంట సంక్షేమ శాఖ డీడీ మయూరి, వైద్యాధికారి ప్రియంవధ, సీహెచ్‌వో ఎస్ఆర్ ప్రసాద్‌స్వామి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

విద్యార్థులందరూ క్షేమం..!

అన్నపర్రు బీసీ హాస్టల్‌లో ప్రస్తుతం 26 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని అధికా రులు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ప్రత్తిపాటి చిట్టిబాబు అనే విద్యార్థికి వాంతులు విరోచనాలు అవుతుండడంతో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 30 మంది గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని, ఒక విద్యార్థి ఎయిమ్స్‌లో ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. 40 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు స్వగ్రామాలకు తీసుకెళ్లగా వారిలో అక్కపాలెంకు చెందిన తమ్మిశెట్టి గోపీచంద్ అనే విద్యార్థికి వాంతులు, విరోచనాలు కావడంతో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు వారు వెల్లడించారు.

నేటి నుంచి 18 వరకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రీ ఎన్ఐ, ఎన్ఐ పనుల కారణంగా ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ సోమవారం తెలిపారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు-కాజీపేట మధ్యన రద్దు చేసి కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నడుపుతామన్నారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ వరకు కాజీపేట వరకే నడుస్తుందని చెప్పారు. విశాఖపట్టణం-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 17వ తేదీ వరకు గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. షాలిమార్-చర్లపల్లి, సీఎస్‌టీ-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 16, 17వ తేదీల్లో, చర్లపల్లి -షాలిమార్, భువనేశ్వర్- సీఎస్‌టీ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 17, 18 తేదీల్లో, కాకినాడ పోర్టు- సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 18న, షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 15వ తేదీన గుంటూరు-పగిడిపల్లి మార్గంలోకి మళ్లిస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు.

కొల్లిపరలో ఒకే రోజు ఆరు గృహాల్లో చోరీ

కొల్లిపర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొల్లిపరలో ఒకే రోజు ఆరు గృహాల్లో చోరీ జరిగింది. కొల్లిపరకు చెందిన ఉయ్యూరు వేమారెడ్డి, పుల్లారావు, సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి గృహాల్లో సోమవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. జొన్నల శ్రీనివాసరెడ్డి ఇంట్లో మాత్రం ల్యాప్‌ట్యాప్, వెండి వస్తువులు పోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, మండలంలోని గ్రామాల్లో గత ఏడు నెలలుగా వరుసగా జరుగుతున్న దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రాత్రి వేళల్లోనే కాకుండా పట్టపగలే దొంగతనాలు జరగడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. గతంలో వరుసగా వల్లభాపురం, మున్నంగి, తూములూరు దొంగతనాలు జరిగాయి. ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ తూములూరు, కొల్లిపర గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించి దొంగతనాలు జరుగకుండా కఠినంగా వ్యవహరించేటట్లు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎస్పీ జనార్ధనరావు, సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావును పిలిచి గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలు పట్ల అజాగ్రత్త వహించవద్దని, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను, గ్రామాల్లో సీసీ కేమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి హామీని సవాల్ చేస్తూ కొల్లిపరలో మరో చోరీ జరగడంతో ప్రజలు మరింత భయపడుతున్నారు.


కొల్లిపరలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

మెలియాయిడోసిస్ నమూనాల సేకరణపై శిక్షణ


శిక్షణలో వైద్యులు శోభారాణి, ముఖోపాధ్యాయ, మల్లేశ్వరి

గుంటూరు మెడికల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెంలో మూడు నెలల వ్యవధిలో పెద్ద సంఖ్యలో వెలుగు చూసిన మరణాలు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. తురకపాలెంలో 30 మంది గ్రామస్థులు మరణించగా, దీనికి మెలియాయిడోసిస్ జ్వరాలే కారణమని అనుమానాలు వ్యక్తమయ్యాయి. కొన్ని కేసుల్లో మెలియాయిడోసిస్ జ్వరాలకు కారణమయ్యే బర్ఖల్‌దేరియా సూడోమల్లీ బ్యాక్టీరియా ఉన్నట్లు కూడా తేలింది. ఈ నేపథ్యంలో సోమవారం గుంటూరు రీజినల్ పబ్లిక్ ల్యాబ్‌లో మూడు రోజులు పాటు మణిపాల్ వైద్య బృందం ఆధ్వర్యంలో పర్యావరణంలో, ముఖ్యంగా తడి నేలల్లో మెలియాయిడోసిస్‌కు కారణమయ్యే బ్యాక్టీరియా శాంపిల్స్‌ను సేకరించే విధానంపై వైద్యనిపుణులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజులు పాటు కొనసాగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. ఈ మూడు రోజుల శిక్షణా తరగతుల్లో డాక్టర్ ముఖోపాధ్యాయ, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, డాక్టర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పంపుతూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 27న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమం సందర్భంగా విధుల్లో ఉన్న హైకోర్టు డ్రైవర్ లక్ష్మీ నారాయణపై రూరల్ సీఐ శ్రీనివాసరావు చొక్కా పట్టుకుని అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ డ్రైవర్ నడిపే కారునే కాకుండా, హైకోర్టు కేసులకు సంబంధించిన ఫైల్స్ ఉన్న వాహనాన్ని కూడా రూరల్ స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. హైకోర్టు జడ్జి ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఏకంగా ఎస్పీని పిలిపించి విచారించారు. దీంతో అదే రోజు సీఐ శ్రీనివాసరావుపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆయనను వీఆర్‌కు పంపడం గమనార్హం. అయితే మంగళగిరి రూరల్‌కు ఇంకా ఎవరినీ నియమించలేదు.

వీఆర్‌కు తెనాలి వన్‌టౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి వన్‌టౌన్ సీఐ రమేష్‌బాబును వీఆర్‌కు పంపారు. ఆయన గత వైసీపీ ప్రభుత్వంలోనే వన్‌టౌన్ సీఐగా నియమితులయ్యారు. రెండేళ్ల సర్వీసు పూర్తికావడంతో ఆయనను బదిలీ చేసి ఆ స్థానంలో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం మెరైన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావును నియమించారు.

మాతృ, శిశు మరణాలపై అంతర్జాతీయస్థాయి అధ్యయనం!

● గుంటూరు జీజీహెచ్‌ని సందర్శించిన ప్రపంచ బ్యాంక్ బృందం

● రోగుల వైద్య సేవలపై ఆరా...పలు విభాగాల పరిశీలన

గుంటూరు మెడికల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి కొలమానం..రక్షిత మంచినీరు, మాతృ, శిశు మరణాల సంఖ్య. అభివృద్ధి చెందిన దేశాల్లో మాతృ, శిశు మర ణాలు స్వల్పంగా ఉంటాయి. ఇటీవల కాలంలో మన దేశంలో కూడా మాతృ మరణాలు (ఎంఎంఆర్), శిశు మరణాలు (ఐఎంఆర్) రేటు బాగా తగ్గినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో మాతృ, శిశు మరణాల రేటును అధ్యయనం చేసేందుకు ప్రపంచ బ్యాంక్ బృందం కొద్దిరోజులుగా రాష్ట్రంలో పర్యటిస్తోంది. సోమవారం ఈ బృందం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని సందర్శించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ప్రపంచ బ్యాంక్ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం ఈ బృందం ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించింది. క్వాలిటీ ఎస్యూరెన్స్ నేషనల్ హెల్త్ మిషన్ తరఫున శిశు వైద్యవిభాగంతో పాటు అత్యవసర విభాగం పనితీరును పరిశీలించారు. ప్రపంచ బ్యాంక్ బృందంలో డాక్టర్ మొహిర్ జోన్, డాక్టర్ ఎడ్వర్డ్, డాక్టర్ గణేష్ మణిముత్తు, వాసు బాబు సభ్యులుగా ఉన్నారు. అత్యవసర విభాగం పనితీ రు, అక్కడ రోగుల రద్దీని తగ్గించేందుకు తీసు కుంటున్న చర్యలను ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగా ధిపతి డాక్టర్ చంద్ర రాధిక రాణి ఈ బృందానికి వివరించారు, శిశు వైద్య విభాగంతో పాటు నియోనేటల్ ఐసీయూ, పీడియాట్రిక్ ఐసీయూ విభాగాలను సభ్యులు పరిశీలించారు. ఇక్కడ నమోదౌతున్న ఐఎంఆర్, ఎంఎంఆర్‌ల గురించి పీడియాట్రిషియన్ డాక్టర్ ఝాన్సీరాణి వారికి వివరించారు. అనంతరం వివిధ వార్డులతో పాటు ఆపరేషన్ థియేటర్లలో చేపడుతున్న ఇన్ఫెక్షన్ కంట్రోల్ విధానాలను వైద్య సిబ్బందితో చర్చించారు. సూపరింటెండెంట్ ఛాంబర్‌లో డాక్టర్ రమణయశస్వితో సమావేశమై పలు అంశాలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు చర్చించారు. ఆసుపత్రిలో వైద్యసేవల కోసం పెద్ద సంఖ్యలో వస్తున్న రోగులు, మౌలిక వసతులు మెరుగుపరచవలసిన విషయాలపైన ఈ బృందం అధ్యయనం చేసింది. సమీప భవిష్యత్తులో మరింత లోతైన అధ్యయనం చేసి వైద్యాధికారుల నుంచి మరిన్ని ప్రతిపాదనలు స్వీకరిస్తామని ప్రపంచ బ్యాంక్ బృందం సభ్యులు వెల్లడించారు.


అత్యవసర వైద్య విభాగాన్ని సందర్శించిన ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

జీవన ఎరువులతో అధిక దిగుబడులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులు వినియోగించి పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో వ్యవసాయంలో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవన ఎరువులతో విత్తనశుద్ధిపై ఈ నెల 13 నుంచి 17 వరకు విశ్వవిద్యాలయంలో ప్రదర్శన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నవీన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

తాడికొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడికొండలోని గంగా భ్రమరాంబ సమేత వీరచెన్న మల్లికార్జున స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వకర్త రాచపూడి వెంకట నరసింహరావు అర్జీని అందజేశారు. గుడికి వెళ్లటానికి భక్తులకు సరైన రోడ్డు మార్గం, సరైన నిర్వహణ లేదన్నారు.

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

తాడికొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టాలని తాడికొండ వైసీపీ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు పేర్కొన్నారు. సోమవారం తాడికొండలో కల్తీ మద్యానికి వ్యతిరేకంగా తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు.

మందడం విద్యార్థినులకు పతకాలు

తుళ్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరుగుతున్న బాక్సింగ్ అండర్ 17 బాలికల విభాగంలో మందడం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బి.భవ్య, తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.లలిత రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్స్ సాధించినట్టు పీడీ సాంబశివరావు సోమవారం తెలిపారు.

కాకుమానుకు బస్సు సర్వీస్ ఏర్పాటుచేయాలి

కాకుమాను, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి కాకుమానుకు బస్సు సర్వీస్ ఏర్పాటుచేయాలని మండలంలోని చిన్నలింగాయాపాలెంకు చెందిన రావిపూడి అశోక్ సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌లో కోరారు. గుంటూరు-వట్టిచెరుకూరు మీదగా లింగంగుంటపాలెం, వల్లూరు, చిన్నలింగాయపాలెం, బీకే పాలెం గ్రామాలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు సీపీఎం నేతల అర్జీ

తాడేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి అమరారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న వారికి ఇళ్లపట్టాలు రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ సీపీఎం నేతలు తాడేపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు సోమవారం అర్జీ అందించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఉండవల్లి పార్థసారధి, రామారావు, గాంధి, శివయ్య పాల్గొన్నారు.

17వ తేదీన మంగళగిరి తరలిరావాలి

తాడేపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత పేదలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తానన్న వాగ్దానాన్ని నెరవేర్చాలని సీపీఎం నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఇంటి స్థలాల సాధన కోసం ఈ నెల 17వ తేదీన మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి ఏపీఎస్పీఎఫ్ క్రీడా పోటీలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రత్యేక రక్షణ దళం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 14 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్నాయని ఏపీఎస్పీఎఫ్ డీఎస్పీ ఆర్‌వీఎస్‌ఎన్ మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 23వ తేదీన 34వ ఏపీఎస్పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎన్‌యూలో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

నేటి నుంచి కృత్రిమ చేతుల పంపిణీ శిబిరం

మంగళగిరి సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న కృత్రిమ చేతులను మంగళకరం పేరిట ఈ నెల 14నుంచి 17వ తేదీ వరకు పంపిణీ చేస్తున్నట్టు రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. పాత కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభిస్తారని, ప్రతిరోజు ఉదయం 9నుంచి సాయంత్రం 5 వరకు వీటిని అందజేస్తామన్నారు.

దుగ్గిరాలలో సంతకాల సేకరణ

దుగ్గిరాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ పిలుపు మేరకు చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం దుగ్గిరాల రైలుపేటలో ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ప్రారంభించారు. ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

16 నుంచి యోగ శిబిరం

మంగళగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గీతా యోగ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి 233వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని ప్రధాన యోగాచార్యులు పంచుమర్తి సత్యనారాయణ గురూజీ తెలిపారు.

పశ్చిమడెల్టాకు 6034 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమడెల్టాకు 6034 క్యూసెక్కు నీరు సోమవారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12.0అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 1,10,110 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా రు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ చానల్ కు240, రేపల్లె కాల్వకు 1658, తూర్పు కాల్వకు 598, ప శ్చిమ కాల్వకు195, నిజాంపట్నం కాల్వకు387, కొమ్మమూరు కాల్వకు 2980క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అవయవదానంతో ఇద్దరి జీవితాలలో వెలుగు


రాజులపాటి పాప (ఫైల్‌ఫోటో)

తాడేపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌డెడ్‌కు గురైన ఓ మహిళ అవయవదానం ఇద్దరి జీవితాలలో వెలుగులు నింపింది. మణిపాల్ వైద్యశాల ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం నులకపేటకు చెందిన రాజులపాటి పాప(64) అదే ప్రాంతంలో శనివారం రోడ్డు ప్రమాదానికిగురైంది. చికిత్స నిమిత్తం ఆమెను మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తలకు గాయమవ్వగా శస్త్రచికిత్స నిర్వహించినా ప్రయోజనం లేకపోవడంతో రాజులపాటి పాపను బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. ఆమె భర్త నాంచారరావు, కుటుంబసభ్యుల అంగీకారంతో కాలేయంను మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒకరికి, కార్నియాను విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి సోమవారం తరలించారు. అవయవదానానికి అంగీకరించిన రాజులపాటి పాప కుటుంబసభ్యులను జీవన్‌దాన్‌ట్రస్టు చైర్మన్ డాక్టర్ కె రాంబాబు, మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి, తదితరులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.


కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్

కలెక్టర్‌తో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల, శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ అశుతోష్ శ్రీవాస్తవలను సోమవారం ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రలు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. లా అండ్ ఆర్డర్, లీగల్, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్‌ను కోరారు.

మద్యం మాఫియాలో వైసీపీ, టీడీపీ కుమ్మక్కు

● బీసీవైపీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్


మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

మంగళగిరి సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలు కుమ్మక్కై మద్యం మాఫియాను నడుపుతున్నాయని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ఆరోపించారు. మంగళగిరిలోని బీసీవైపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో చంద్రబాబుకు రహస్య ఒప్పందం వుందని, చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఏదో ఒక రూపంలో పెద్దిరెడ్డికి మేలు చేస్తారని చెప్పారు. బీసీలకు రక్షణ చట్టం తెస్తామని చెప్పి నేటికీ ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.


కాజలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మంగళగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలో ఇరువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నేతలు సోమవారం బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. గ్రామానికి చెందిన ఆర్ధల సాంబశివరావుకు రూ.45వేలు, మాణిక్యాల శ్రీలక్ష్మీకి రూ.20వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, నేతలు మాణిక్యాల రవి, కుక్కమళ్ల విక్రమ్ బాబు, ఆర్ధల గోపిరాజు, చింకా కోటేశ్వరరావు, ఆర్ల పున్నయ్య, పల్లబోతుల శివసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థలో వర్చువల్ వర్క్‌షాప్

తాడేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కుంచనపల్లిలోని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినోత్సవం (ఐడీఆర్‌ఆర్) సందర్భంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ, యునిసెఫ్ ఆధ్వర్యంలో ఏపీలో సంసిద్ధత, భాగస్వామ్యంతో సామర్థ్యం గల కమ్యూనిటీలను నిర్మించే అంశంపై సోమవారం వర్చువల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ విపత్తు అవగాహన, సంసిద్ధతను ప్రోత్సహించడానికి ఐడిఆర్‌ఆర్ నిర్వహిస్తారని చెప్పారు. మెసేజ్‌ల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు అలెర్టులు చేరవేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యునిసెఫ్ నుండి డాక్టర్ మహేంద్ర రాజారాం, డాక్టర్ బి.ప్రసాద్, ఎన్ఐడీఎం నుండి డాక్టర్ బాలు, ఎస్‌డీఎంఏ నుండి హరిష్‌నాయుడు, డాక్టర్ బసవంత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్‌దీపక్, జిల్లాల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యునిసెఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లమడ రైతు సంఘ నేత రామన్ మృతి


కొల్లా రామన్ (ఫైల్)

పెదనందిపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడుకు చెందిన నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రామన్ (58) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతదేహంపై సీపీఐ(ఎంఎల్) జెండాను ఉంచి జోహార్లు అర్పించారు. జిల్లా నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు, యార్లగడ్డ అంకమ్మచౌదరి, పలు సంఘాల నాయకులు ఉన్నారు.

స్కేటింగ్‌లో రాణించిన చిన్నారులకు అభినందన

మంగళగిరి సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన గుంటూరు రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబర్చిన మంగళగిరికి చెందిన చిన్నారులు కోసూరి పరిణిక శతాక్షి, చేతన్‌లను మానవ వికాసమండలి ప్రతినిధులు అభినందించారు. శతాక్షి ఒక స్వర్ణం, ఒక రజతం, చేతన్ రెండు స్వర్ణ పతకాలను సాధించారన్నారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు రేఖా కృష్ణార్జునరావు, బుద్ధవిహార ట్రస్టు కార్యదర్శి పామర్తి రవి, రేఖా నరేష్‌బాబు, తలగాని జ్యోతి, గోలి మధు, దాసరి శ్రీనివాసరావు, వాకా ముత్యాలు పాల్గొన్నారు.

రైతు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీ రైతు సంఘ నాయకులు డిమాండ్


తహసీల్దార్ హేనాప్రియకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

పెదనందిపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి కొత్త వెంకటశివరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ హేనాప్రియకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రబీ సీజను ప్రారంభం అవుతుందని ప్రభుత్వం శనగలకు క్వింటా రూ.5850 సబ్సిడీపై అందజేస్తామని తెలుపుతుందని, కానీ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.5500 ఉందని దీని వలన రైతులకు ప్రయోజనం ఉండదన్నారు. 90శాతం సబ్సిడీపై అందించాలన్నారు. గతంలో మాదిరిగానే ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంటరుణాలు, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. జింక్, జిప్సమ్ వంటివి ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు నల్లమోతు రాజేంద్ర, దొప్పలపూడి రమేష్‌బాబు, పసుపులేటి శేషగిరిరావు, మాకినేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలి

సీపీఎం నేత సీహెచ్ బాబూరావు


దీక్షలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర నేత బాబూరావు

మంగళగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సోమవారం నిరసన దీక్షలను ఆయన ప్రారంభించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్ అధ్యక్షతన జరిగిన సభలో బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు వేల ఎకరాలను కేటాయిస్తుందని, పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. మంగళగిరిలో 20 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కేవలం 3వేల మందికే పట్టాలు ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 17న దరఖాస్తుదారులతో ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే దశలవారీగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వైనేతాజీ, నేతలు ఈమని అప్పారావు, చెంగయ్య, బి.వెంకటేశ్వరరావు, జేవీ రాఘవులు, పీ.బాలకృష్ణ, ఎం.పకీరయ్య, వేముల దుర్గారావు, పల్లె కృష్ణ, బి.కోటేశ్వరి, డి.రామారావు, యూ దుర్గారావు, ఎం.చలపతిరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి : ఎంపీడీవో స్వామిరెడ్డి

పెదనందిపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో స్వామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా థీమ్ 5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే విధంగా ప్రజల్లో చైతన్య తీసుకురావాలన్నారు. ప్రభుత్వం గ్రామాలల్లో సుస్థిరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తుందని దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన కౌలురైతులకు రూ.20వేలు అందించాలి



దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కౌలురైతులు

దుగ్గిరాల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన కౌలురైతులందరికీ రూ.20వేల చొప్పున వారి ఖాతాల్లో జమచేయాలని కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు అన్నారు. దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట కౌలురైతుల సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు కౌలురైతులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామసభల ద్వారా కైలురైతులకు రుణాలందించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించిన వారిలో వ్యకా.స. జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, పఠాన్ ఇస్మాయిల్‌ఖాన్, దేవినేని బుజ్జి, దూళ్ల సుబ్బారావు, ఎం. జగన్మోహనరావు, షేక్ ఆరిఫ్ ఉన్నారు.

నిర్మల ఫార్మసీలో రోటరాక్ట్ సభ్యుల ఎన్నిక

మంగళగిరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో రోటరాక్ట్ క్లబ్ ఇన్‌స్టలేషన్, చార్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం సోమవారం జరిగింది. జొన్నాదుల కేదారేశ్వరి లక్ష్మీ అధ్యక్షురాలిగా, బండి సంజన కార్యదర్శిగా, చల్లా కార్తికేయ శ్రీరామ్ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్ పీడీజీ అన్నే రత్నప్రభాకర్, అడ్వయిజరీ కమిటీ రీజనల్ చైర్ జంగాల వెంకటేష్, మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్, సెక్రెటరీ పారేపల్లి నిరంజన్‌గుప్తా, మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, నిర్మల ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ జీ.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి, డాక్టర్ రేఖా నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న గింజుపల్లి శివరామప్రసాద్

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ప్రత్తిపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వంగిపురంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ శంకుస్థాపనచేశారు. ఈ నిధులతో మూడు సీసీరోడ్లను నిర్మించనున్నారు. సర్పంచ్ శిఖావిజయలక్ష్మి, ఎంపీటీసీ సాంబశివరావు, రామ్మోహనరావు, సురేష్, సుబ్బారెడ్డి, పెంటారెడ్డి, జగన్, సుబ్బారావు, మందా రవి, సదాశివరావు,సుబ్బారావు పాల్గొన్నారు

● కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్‌టీ రేట్లతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షులు శివరామప్రసాద్ అన్నారు. ఎంపీడీవో శివపార్వతి ఆధ్వర్యంలో జీఎస్‌టీపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంతృప్తి స్థాయిని పెంచేలా ఫిర్యాదుల పరిష్కారం

● డీఆర్వో షేక్ ఖాజావలీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదికకు అందిన అర్జీల పరిష్కారంలో సంతృప్తి స్థాయిని మరింతగా మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో షేక్ ఖాజావలి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జడ్పీసీఈవో వీ జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్‌తో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు.

● మా కాలనీకి వంతెన, సిమెంటు రోడ్లను ఏర్పాటు చేయాలని మేడికొండూరు మండలం, యడ్లపాటి వెంకట్రావు కాలనీవాసులు అర్జీ అందజేశారు. వంతెన లేకపోవడంతో వర్షాల సమయంలో కొండవీడు వాగు పొంగి ఆ నీరు తమ ఇళ్లల్లోకి వస్తుందని తెలిపారు. ఎస్టీలు అధికంగా నివసించే తమ కాలనీలో సౌకర్యాలు కల్పించాలని కోరారు.

● నీటి ట్యాంకర్ల మరమ్మతుల కొరకు నిధులు మంజూరు చేయాలని పెదనందిపాడు మండల గ్రామాల స్థానికులు అర్జీ అందజేశారు. మండల పరిధిలో ఏడు గ్రామాల్లో ఉన్న ట్యాంకర్లకు నాగార్జునసాగర్ నుంచి పైపులైను ద్వారా ట్యాంకర్లను నింపుకొని ఆ నీటిని అవసరాల కోసం వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఈ మధ్య ఆ పైపులైన్లు పాడైపోవడంతో నల్లపాడు డ్రైనేజీ మురుగునీరు, ఆ నీటిలో కలుస్తుందని, అదే నీరు సరఫరా అవుతుందని వివరించారు. ఉన్నతాధికారులు స్పందించి కొత్త పైపులైన్లను ఏర్పాటు చేసి టాంకర్లకు మరమ్మతులు చేపట్టాలని పంగులూరి రామకృష్ణ, శ్రీధర్ తదితరులు కోరారు.

● గుంటూరు ఛానల్ పొడిగింపు కింద భూములు కోల్పోతున్న రైతులకు న్యాయబద్ధమైన పరిహారం అందించాలని పెదనందిపాడు, మండలం రావిపాడు గ్రామస్తులు అర్జీ అందజేశారు. గ్రామసభల్లో భూమి విలువ రూ.8లక్షలుగా అధికారులు నిర్ధారించారని తెలిపారు. వాస్తవానికి బహిరంగ మార్కెట్లో ఎకరా రూ.30 లక్షలు వరకు విలువ ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పరిహారం లేదా మరోచోట సమానమైన భూమిని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పీజీఆర్‌ఎస్‌కు ఒక అర్జీ

కాకుమాను, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కర వేదిక(పీజీఆర్‌ఎస్)కు ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు గురించి తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోళ్ల అరుణ్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలని జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు డిమాండ్‌చేశారు. స్థానిక విద్యానగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ, మాల మధ్య చిచ్చుపెట్టేందుకు అరుణ్‌కుమార్ యత్నిస్తున్నాడని ఆరోపించారు. గత మూడు నెలలుగా రాని అరుణ్‌కుమార్ ఇప్పుడు ఎందుకువచ్చాడని ప్రశ్నించారు. ప్రత్తిపాడు మార్కెట్‌యార్డు చైర్మన్ బొందలపాటి అమరేశ్వరి మాట్లాడుతూ అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధికారప్రతినిధి బి.వెంకట్రావు మాట్లాడుతూ ఎమ్మెల్యేపై దాడిని ఖండిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కల అగస్టీన్, బొద్దుపల్లి స్మితపద్మజ, ప్రఖ్యాత తదితరులు పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీకి కోవర్టు గా పనిచేస్తూ ప్రజలను రెచ్చగొట్టి వారినుండి లబ్ధి పొందాలంటే చూస్తూ ఊరుకోం.. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇక నీ ఆటలు సాగవంటూ అరుణ్‌కుమార్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు దక్కుమళ్ల భాగ్యారావు హెచ్చరించారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో ఎస్సీ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేపై అరుణ్‌కుమార్ వ్యాఖ్యల్ని ఖండించారు. కార్యక్రమంలో వి.క్లింటన్‌బాబు, కె.మనోజ్‌కుమార్, జె.కాంతారావు, బాలస్వామి, భాగ్యానందరావు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: ఎమ్మెల్యే రామాంజనేయులుపై అనుచిత వాఖ్యలుచేసిన అరుణ్‌కుమార్‌ను అరెస్ట్‌చేసి చర్యలు తీసుకోవాలని ఏఎంసీ డైరెక్టర్ చాగంటి సత్యహర్ష డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తురకపాలెం ప్రజలకు తోడుగా ఉంటున్న ఎమ్మెల్యేపై అనుచితవాఖ్యలు చేయడం సరికాదన్నారు.

చినరాములు సేవా దృక్పథం ప్రతి ఒక్కరికి ఆదర్శం


పుల్లడిగుంటలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించిన ఎన్ఆర్ఐలు పురుషోత్తం చౌదరి, అనీల్ లింగమనేని, ఉప్పుటూరి చినరాములు

వట్టిచెరుకూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంటలో మాజీ జెడ్పీటీసీ స్వర్గీయ ఉప్పుటూరి సీతామహాలక్ష్మీ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎన్ఆర్ఐ రామ్ చౌదరి ప్రోత్సాహంతో పేదలు, బాటసారులకు సొంత నిధులతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను సోమవారం ఎన్ఆర్ఐలు పురుషోత్తం చౌదరి, అనీల్ లింగమనేనిలు సందర్శించారు. రామ్‌చౌదరి తండ్రి ఉప్పుటూరి చినరాములు స్వయంగా అన్న క్యాంటీన్‌ను నిర్మించటమే కాకుండా నిత్యం క్యాంటీన్ నిర్వహణ ద్వారా పేదలకు అన్నదానం చేయటం హర్షణీయమన్నారు. ఈ సేవా దృక్పథం ప్రతి ఒక్కరిలో కలగాలని వారు ఆకాంక్షించారు.



ఎక్స్‌లెంట్ 2025 హ్యాక్‌థాన్‌లో విజయం సాధించిన జట్టుతో ప్రిన్సిపాల్ జే అప్పారావు, డీన్‌లు తదితరులు

ఎక్స్‌లెంట్ 2025 హ్యాక్‌థాన్‌లో మలినేని విద్యార్థుల జాతీయ స్థాయి ఘనత

వట్టిచెరుకూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల గుంటూరు ఐటీ శాఖ నాల్గవ సంవత్సరం ఐటీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగిన ఎక్స్‌లెంట్ 2025 హ్యాక్‌థాన్‌లో గ్రాండ్ విజేతలుగా నిలిచి ప్రథమ బహుమతి కింద రూ.లక్ష నగదును కైవసం చేసుకున్నారు. ఈ హ్యాక్‌థాన్‌ను బైటెక్సెల్ సంస్థ జాతీయస్థాయిలో మూడు రౌండ్లుగా నిర్వహించగా దేశవ్యాప్తంగా 220 జట్లలో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రాండ్ ఫినాలే ఈనెల 11వ తేదీ హైదరాబాద్ రాయదుర్గంలోని టీ హబ్‌లో జరిగింది. ఈ ఫినాలేలో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఐటీ విభాగం నాల్గవ సంవత్సరం విద్యార్థులు నాదెండ్ల సిరిమూర్తి టీమ్ లీడరుగా వసంత నవ్య, హిమబిందు, సుప్రజ, ఉషశ్రీలు బైటెక్స్‌లెన్స్ జట్టుగా పాల్గొని ఒకటో బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ జట్టుకు ప్రిన్సిపల్ జే అప్పారావు, కళాశాల యాజమాన్యం, కళాశాల డీన్‌లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు ఘన స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పెరుమాళ్ళ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో గ్రాండ్ విన్నర్‌గా నిలవటం గర్వకారణమని అన్నారు.

రాష్ట్ర పారా స్విమ్మింగ్ చాంపియన్ దేవేంద్రకు సన్మానం


రాష్ట్ర పారా స్విమ్మింగ్ చాంపియన్ దేవేంద్రను సన్మానిస్తున్న సర్పంచ్ మేడా బాబు

ఫిరంగిపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఏడో పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన ఫిరంగిపురం-2 సచివాలయంలో పనిచేస్తున్న డీఐ ఘంటా దేవేంద్రను సర్పంచ్ మేడా బాబు, ఈవో ఏ కిషోర్‌బాబులు సోమవా రం ఘనంగా సన్మానించారు. ఈనెల 12న ఏలూరులో విశ్వనాథ్ జార్జియ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన వంద మీటర్ల ఫ్రీ స్టైల్, 50 మీటర్ల ఫ్రీస్టైల్ పోటీల్లో దేవేంద్ర గోల్డ్‌మెడల్ సాధించారు. పంచాయతీ అధికారులు సూర్యనారాయణ, గ్రామ పెద్దలు దేవేంద్రను సన్మానించారు. దేవేంద్ర మాట్లాడుతూ జాతీయ స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యానని తెలిపారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడికొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు పేర్కొన్నారు. సోమవారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ తాడికొండ బస్టాండ్‌లో ఆందోళనలు చేపట్టారు. అనంతరం తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలోని డీటీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపుకార్డులతో పాటు పంట రుణాలు ఇప్పించాలన్నారు. యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. యూరియా అధిక ధరలకు అధికారులు అడ్డుకట్టవేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాణావత్ భద్రయ్య, నీలయ్య, జోషి, అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరస్పాండెంట్ నరసింహంకు ఘన సన్మానం

మంగళగిరి సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన దామర్ల వెంకటనరసింహంను సోమవారం దామర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళగిరిలో హైకోర్టు న్యాయవాదిగా, ఆడిటర్‌గా, హైకోర్టు మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ కమిటీ సభ్యులు గా సేవలందిస్తున్న నరసింహం కరస్పాండెంట్‌గా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు దామర్ల కనకలింగేశ్వరరావు, రాజు, నాగరాజు రాము, శంకరరావు, భిక్షారావు, మల్లి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అంగన్‌వాడీ కార్యకర్తలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. చినరావూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం డాక్టర్ అర్చన మాట్లాడుతూ, రొమ్ముల్లో కణితిలు ఏర్పడి క్యాన్సర్ వస్తుందన్నారు. ముందుగా గుర్తిస్తే సులభంగా నయం అవుతుందని, రొమ్ము పరిమాణం మార్పులు, చనుమెనల నుంచి స్రావం వంటి లక్షణాలు గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ, క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి వెంకటనారాయణ, మురళీకృష్ణ, విజయభాస్కర్, ఇందిర పాల్గొన్నారు.

రౌడీయిజాన్ని పూర్తిగా అదుపు చేస్తాం

● సీఐ సాంబశివరావు


సీఐ సాంబశివరావు

తెనాలి క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో రౌడీయిజాన్ని పూర్తి స్థాయిలో అదుపులోకి తెస్తామని సోమవారం 3వ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.సాంబశివరావు తెలిపారు. 2004 బ్యాచ్‌కి చెందిన తాను సత్యవేడు, మాచర్ల, ఉదయగిరి, రేపల్లె, కనిగిరి, వినుకొండ పోలీస్‌స్టేషన్‌లతో పాటు మెరైన్ విభాగంలో పనిచేసినట్లు తెలిపారు. మొదటి నుంచి ప్రశాంతతకు, మేధావులకు, విద్యావంతులకు తెనాలి నిలయం అన్నారు. రౌడీయిజం, గంజాయి, జూదం ఇతర ఆగడాలు క్రమ క్రమంగా పట్టణంలో పెరిగాయని వాటిని అదుపుచేస్తానన్నారు. తన స్టేషన్ పరిధిలో లంచగొండితనం, బ్రోకర్లకు ఆస్కారం లేదన్నారు. ప్రధానంగా రౌడీయిజం, చట్ట వ్యతిరేక చర్యలు అదుపు చేయడంలో, విద్యావంతులు, మేధావులు తోడ్పాటు కోరుతున్నానన్నారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన రమేష్‌బాబు పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేశారు.

'రేపటిలోగా బాణసంచా దుకాణాల లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి'

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15లోగా దీపావళి బాణసంచా విక్రయాల లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు. తెనాలి డివిజన్‌లోని ఆయా మండలాల్లో విక్రయాలు కోసం అవసరమైన వివరాలు నింపి వ్యాపారులు ఆయా మండలాల్లో తహసీల్దార్లకు దరఖాస్తులు అందించాలని కోరారు. ఈ లైసెన్స్‌లు తాత్కాలిక ప్రతిపాదికపై పండుగ వరకే చెల్లుబాటు అయ్యేలా మంజూరు చేస్తామన్నారు.

నేడు బిల్డర్లు, కాంట్రాక్టర్లకు జీఎస్‌టీపై అవగాహన సదస్సు

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బిల్డర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, లైసెన్స్ సర్వేయర్లలకు జీఎస్‌టీపై అవగాహన సదస్సుకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. కమర్షియల్ టాక్స్ అధికారులు జీఎస్‌టీ పన్ను తగ్గింపుపై అవగాహన కల్పిస్తారని, సందేహాలు నివృత్తి చేస్తారని తెలిపారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సంఘం నాయకుల వినతి

పెదకాకాని, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సోమవారం పెదకాకానిలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు కౌలురైతు రైతు వ్యవసాయ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ యజమాని సంతకంతో పనిలేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డుఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని, దేవాలయ భూములను సాగుచేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పనులను సంవత్సరంలో 200రోజులు కల్పించి, రోజువారీ వేతనం 600రూపాయలు ఇవ్వాలన్నారు. గుంటూరు చానల్ కొండవీటి వాగు ఇతర కాల్వ కట్టలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో నన్నపనేని శివాజీ, సంకూరి నీలాంబరం, కోటిపల్లి సత్యనారాయణ, కే శివప్రసాద్ పాల్గొన్నారు.

క్రైస్తవులు ఐకమత్యంగా ఉండాలి

● ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని క్రైస్తవులందరూ సమన్వయం పాటిస్తూ ఐకమత్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రైస్తవ సంఘాల నాయకుడు ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి సోమవారం కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏసుప్రభువును నమ్మేవారు దాదాపు 20శాతం ఉంటారన్నారు. సహజంగా క్రైస్తవులు సేవా దృక్పథంతో పనిచేస్తారని, దాడులు చేయటం, ప్రతీకారం తీర్చకోవడం గాని చేయరన్నారు. కానీ ఈ మధ్య కొంతమంది క్రైస్తవ వ్యతిరేకులు ఏసు ప్రభువును, బైబిల్ గ్రంథాన్ని దూషించడాన్ని బట్టి కొన్నిచోట్ల మతసామరసం దెబ్బతినే ప్రమాదం ఉందని గుర్తించామన్నారు. దేశంలో మైనారిటీల కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని మైనారిటీ కమిషన్ ఉందన్నారు. జగన్ ప్రభుత్వం కంటే చంద్రబాబు ప్రభుత్వంలో క్రైస్తవ సమాజానికి మేలు జరుగుతుందని అభిప్రాయడ్డారు. జరిగిన మంచిని సమాజానికి తెలియజేసేలా మతసామరస్యం దెబ్బతినకుండా సేవచేసే విద్యావంతులను కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. క్రిస్మస్‌కు రెండు నెలల గడువు ఉన్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు కొంత సమయం తీసుకునైనా కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలని జోసెఫ్ మోసిగంటి విజ్ఞప్తి చేశారు.

అపరిశుభ్రంగా వీరనాయకునిపాలెం

నీటి ట్యాంక్ పరిసరాలు

● ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు


చుట్టూ పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉన్న వాటర్ ట్యాంక్ ఆవరణ


పెచ్చులు ఊడిపోతున్న వాటర్ ట్యాంక్

చేబ్రోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామంలోని రక్షిత తాగునీటి పథకం వాటర్ ట్యాంక్ చుట్టుపక్కల పరిశుభ్రత లేకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ట్యాంక్ చుట్టూ మురుగునీరు చేరడంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో చెత్త, దుర్వాసనలు వ్యాపిస్తున్నాయి. స్థానికులు కొందరు మల, మూత్ర విసర్జన చేస్తుండటంతో చుట్టుపక్కల బ్యాక్టీరియా వ్యాప్తిచెందే ప్రమాదం నెలకొంది. దాదాపు 25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వాటర్ ట్యాంక్‌చుట్టూ పెచ్చులు ఊడిపోవడం, ఇనుప చువ్వలు, బయటికి కనిపించటం, నీరులీక్ అవ్వడం వంటి సమస్యలు చోటుచేసుకుంటున్నాయి. రక్షిత తాగునీటి ట్యాంక్‌ను మరమ్మతులు చేసి, చుట్టుపక్కల ప్రాంతాన్ని శుభ్రపరిచేందుకు అధికారులు తక్షణచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాల ప్రజలకు మేలు

● కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు

కొల్లిపర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్‌లో భాగంగా అధికారులు, యానిమేటర్లు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు కారణంగా మార్కెట్‌లో అనేక వస్తువులకు ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యవసాయ పరికరాల ధరలు తగ్గినట్లు తెలిపారు. ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరల ప్రకారమే వస్తువులను కొనుగోలు చేయవచ్చునన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, మందులు, విద్య, వస్త్రాలు, రవాణా వంటి విభాగాల్లో జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ఏపీఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


కొల్లిపరలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, యానిమేటర్లు

ప్రకృతి వ్యవసాయ రైతులకు పీఎం మోదీ అభినందన


ఢిల్లీలో ప్రకృతి వ్యవసాయ రైతులతో మాట్లాడుతున్న ప్రధాన మంత్రి మోదీ

కొల్లిపర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన రైతులను పీఎం మోదీ అభినందించారు. యర్రు స్వాతితో పాటు నలుగురు రైతులు యర్రు సత్యనారాయణ, యర్రు బాపయ్య, యర్రు రత్తమ్మ, యర్రు రవీంద్రలు గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా దేశీ వరి వంగడాలను, జొన్న, వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో వారి కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పీజీఎస్ న్యాచురల్ ఫార్మా సర్టిఫికెట్‌ను అందుకోవడంకోసం శనివారం ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మోదీ ముఖాముఖిగా వారితో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ఏవిధంగా చేస్తున్నారని రైతులను అడిగి తెలుసుకోవడంతో పాటు వారిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రకృతి వ్యవసాయం సాగుచేసిన స్వాతితో పాటు నలుగురు రైతులకు గౌరవం లభించడంతో సోమవారం వారిని గుంటూరు కృషి భవన్‌లో డీపీఎం రాజకుమారి, యాంకర్ గోపి ఘనంగా సన్మానించారు.


న్యాచురల్ ఫార్మా సర్టిఫికెట్ అందుకున్న స్వాతిని సన్మానిస్తున్న డీపీఎం రాజకుమారి, యాంకర్ గోపిచంద్

తాగునీటి పరిశుభ్రత నమోదుపై అధికారుల పరిశీలన


కొల్లిపరలో తాగునీటి పరిశుభ్రతను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లిపర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలమేరకు సోమవారం పంచాయతీరాజ్ అసిస్టెంట్ డైరెక్టర్ సాయిలహరి తన సిబ్బందితో కలిసి మండలంలోని గ్రామాల్లో తాగునీటి పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ సాయిలహరి మాట్లాడుతూ తాగునీటి సరఫరాను మెరుగు పరిచేందుకు నీటిని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో బార్గవ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఈత పోటీల్లో కిరణ్‌కుమార్‌కు బంగారు పతకం


సత్కారం అందుకుంటున్న కిరణ్‌కుమార్

తెనాలి క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 7వ జాతీయ మాస్టర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 11, 12 తేదీల్లో మంగళగిరి ఎస్‌ఎం షంషేర్‌ఖాన్ మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగాయి. ఈ జాతీయ స్థాయి పోటీలలో తెనాలికి చెందిన రావి కిరణ్‌కుమార్ వివిధ విభాగాల్లో వరుస విజయాలు సాధించారు. 25 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగా పతకం కైవసం చేసుకోగా 50 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, 100 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో ప్రథమ స్థానంలో ఈది బంగారు పతకాన్ని, 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో మూడో స్థానంలో నిలిచాడు. వివిధ విభాగాల్లో విజేతగా నిలిచిన కిరణ్‌కుమార్‌ను సోమవారం సంగమేశ్వర స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు, వివిధ క్రీడా సంఘాలు సత్కరించారు.

ఆలయ పాలక మండలి చైర్మన్‌గా సుధాస్వరూప్


ఆలయ పాలకమండలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్

పొన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని శ్రీసుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన అనువంశిక ధర్మకర్త, పాలకమండలి చైర్మన్ సుధాస్వరూప్ బహదూర్ మన్నే సుల్తాన్ దొరకు ఆలయ అర్చకులు అధికారులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. తొలుత ఆలయంలో భావనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్‌గా సుధాస్వరూప్ బాధ్యతలు స్వీకరించి ప్రమాణ స్వీకారం చేశారు

వ్యర్థాలను కాల్వల్లో వేయడం తగదు

● చైర్ పర్సన్ రాధిక


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ రాధిక

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్వల్లో వ్యర్థాలను వేయడం తగదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. 10వ వార్డులో సోమవారం ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. జంపని డ్రెయిన్ వెంబడి పారిశుధ్యం పర్యవేక్షించారు. డ్రెయిన్‌లో వ్యర్థాలు అధికంగా గమనించి ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని డ్రెయిన్ నిండా వ్యర్థాలు ఉంటున్నాయని చెప్పారు. ప్రతివారం జంపని డ్రెయిన్‌ను శుభ్రం చేస్తే టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నాయన్నారు. జంపని డ్రెయిన్ మార్గంలో రహదారి వెడల్పు తక్కువగా ఉందని, రోడ్లపై ఆటోలు, సైకిల్ రిక్షాలు పెట్టవద్దని ఆదేశించారు. హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి 'మెరియన్ కేర్'

● దళిత ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గుజ్జర్లమూడి కృపాచారి


మెరియన్‌కేర్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జేమ్స్‌మోర్లే

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సమగ్రాభివృద్ధి, విలువలతో కూడిన ప్రారంభ విద్య అందించడం లక్ష్యంగా మెరియన్ కేర్ ఎర్లీ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని దళిత ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గుజ్జర్లమూడి కృపాచారి చెప్పారు. నందులపేటలోని మాంటిస్సోరి స్కూల్ క్యాంపస్‌లో సోమవారం బాలల కోసం ఏర్పాటు చేసిన స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మరియా మాంటిస్సోరి గ్లెన్‌డోమాన్ విద్యా సిద్ధాంతాలను సమన్వయం చేస్తూ చిన్నారులకు విద్యను బోధిస్తారని చెప్పారు. పట్టణంలో ప్రముఖ విద్యా సంస్థగా మాంటిస్సోరి పేరు తెచ్చుకుందన్నారు. క్యాథలిక్ చర్చి ఫాదర్ స్లివయ్య అకాడమీని ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా అకాడమీ ప్రారంభించామన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో నైపుణ్యాలు కల్పించే దిశగా విద్యా బోధన రూపొందించామని చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జోస్ సెబాస్టియన్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాణ సంచా హోల్‌సేల్ దుకాణాల్లో తనిఖీలు


తెనాలిలో బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాణసంచా హోల్‌సేల్ దుకాణాలను అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. నందులపేట, పాండురంగపేటలో హోల్‌సేల్‌గా విక్రయాలు చేస్తున్నారు. వీరి లైసెన్స్‌లను, నిల్వలను, బిల్లులను పరిశీలించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని నిరోధక వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రతిరోజు విక్రయాలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారి లక్ష్మీకుమారి, ఎంఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు: బాణసంచా విక్రయదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఇన్చార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి ఆదేశించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ ఫైర్ వర్క్స్‌లో సోమవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలో ప్రమాదాలు జరగకుండా తీసుకునే జాగ్రత్తలు గురించి తనిఖీచేశారు. దుకాణ యజమానులు, తాత్కాలిక లైసెన్స్‌దారులు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. తప్పనిసరిగా ఫైర్ నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. తనిఖీలలో తహసీల్దార్ జియావుల్‌హక్, అర్బన్ సీఐ వీరా నాయక్ పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం: ధూళిపాళ్ల


గ్యార్మీ పండుగ సందర్భంగా అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హజరత్ మహబూబ్ సుభాని ప్రవక్త బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలో సోమవారం నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హజరత్ మహబూబ్ సుభాని జెండా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, వైసీపీ శ్రేణులు

నకిలీ మద్యాన్ని అరికట్టాలి

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యాన్ని ప్రభుత్వం అరికట్టాలని కోరుతూ వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎక్సైజ్ అధికారుల ద్వారా నకిలీ మద్యాన్ని అమ్ముతుందని ఆరోపించారు. కూటమి నాయకులు అక్రమ సంపాదన కోసం బెల్టు షాపులలో ఈ మద్యం విక్రయాలు చేస్తున్నారని, నియోజకవర్గంలో వేకువ జాము నుంచే మద్యం దుకాణాలు తెరుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కల్తీ మద్యాన్ని అరికట్టి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ప్రతి నెలా 5వ తేదీన ఒక్కో మద్యం షాపు నుంచి రూ.70వేలు మామూలు వసూలు చేస్తున్నారని, దీంతో నకిలీ మద్యాన్ని విక్రయించాల్సిన పరిస్థితి తీసుకు వచ్చారని చెప్పారు. ఎన్నికల ముందు తెనాలిని ఎంతో అభివృద్ధి చేస్తామని చెప్పిన నాయకులు కనీసం కుక్కల బెడదను కూడా నివారించలేకపోయారని, మున్సిపల్ పనులకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రాకుండా పోయారని విమర్శించారు. కొత్తపేటలోని ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ సాయం విడుదల చేయాలి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా వినతి

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వ సాయం వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కౌలుదారుల కోసం ప్రత్యేక చట్టం చేయాలని, వారికి ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కౌలు రైతులకు తగిన గుర్తింపు లేకపోవడంతో వారికి రైతులకు అందించే పథకాలు అందడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నారని, సాగు గిట్టుబాటు కాక నష్టాల బారిన పడుతున్నారని చెప్పారు.

సబ్ కలెక్టర్ గ్రీవెన్స్‌కు 8 దరఖాస్తులు

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 దరఖాస్తులు అందించారు. పోలీసు 3, రెవెన్యూ 2, మున్సిపల్ 2, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు అందినట్లు అధికారులు తెలిపారు.

మున్సిపల్ గ్రీవెన్స్‌కు మూడు దరఖాస్తులు

తెనాలి అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు మూడు దరఖాస్తులు అందించారు. మేనేజర్ జయకర్ అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపారు. నీటి పన్ను తొలగింపు, కాలుష్యం సమస్య పరిష్కరించాలని, హౌస్‌బోర్డు మ్యాపింగ్ కోసం అర్జీలు వచ్చాయని తెలిపారు.

పొన్నూరులో ఎనిమిది అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు దాఖలయినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు రెవెన్యూ సంబంధిత సమస్యలపై 4 అర్జీలు, పురపాలక సంఘంకు 1, పంచాయతీరాజ్‌కు 1, పోలీస్ శాఖకు 1, సర్వే కోసం 1 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి

ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఖుద్దూస్

పొన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి పాటుపడాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్ కోరారు. పట్టణంలోని శ్రీరామ మున్సిపల్ హైస్కూల్లో సోమవారం 15మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరడానికి విచ్చేశారు. వీరికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సాదర స్వాగతం పలికి వృత్తిపరమైన సూచనలు పాఠశాలల్లో విద్యాబోధన గురించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్, మల్లంపాటి వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.